తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 113 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 మంగళవారం 24 - 11 - 2026వెల రూ. 2 రూ/

ఫేసియల్ రికగ్నిషన్‌తో
గ్లోబల్ సమ్మిట్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు
- కార్యక్రమ ఏర్పాట్లు, విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు
- ఫేసియల్ రికగ్నిషన్‌తో గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్ :

గ్లోబల్ సమ్మిట్ 2026కు రానున్న ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది హెచ్చరించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై బోధి పెవెలియన్‌లో సమీక్ష చేశారు. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని తెలిపారు.డెలిగేట్లతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు అతిథుల కోసం ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలోని తోరణాల నమూనాలను గ్లోబల్ సమ్మిట్‌లో ఉపయోగించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. సమ్మిట్‌లో భాగంగా - మిగతా 2 లో



కేటీఆర్ ఊహా ప్రపంచంలో
బతుకుతున్నారు

- భట్టి ఘాటు వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఇక కలేనన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కేటీఆర్ వాస్తవాలు వదిలేసి సోషల్ మీడియా లోకంలోనే ఉంటున్నారని వ్యాఖ్య
- తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందన్న విమర్శ

హైదరాబాద్ :

తెలంగాణలో ప్రజలకు సంక్షేమం అందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల - మిగతా 2 లో

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు
రూ.1,115 కోట్ల కేటాయింపు



- గోదావరి పుష్కరాల లోగో డిజైన్ వర్క్ షాప్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు
- ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు
- 2027 జూన్ 26 నుంచి జులై 07 తేదీ వరకు 77 ప్రాంతాల్లో ఘనంగా పుష్కరాలు

హైదరాబాద్ :

గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనపై ఇవాళ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో - మిగతా 2 లో



సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్ రన్

- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్
- మే 2027లో సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్స్
- గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న బి-28 రైలు
- 2029 నాటికి థానే వరకు విస్తరించనున్న సేవలు
- 508 కిలోమీటర్ల మేర శరవేగంగా సాగుతున్న ప్రాజెక్టు పనులు

ఢిల్లీ :

దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు మరో కీలక మైలురాయికి చేరుకుంది. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య గల 50 కిలోమీటర్ల మార్గంలో 2027 మే నెలలో ప్రయోగాత్మక పరీక్షలు (ట్రయల్ రన్స్) ప్రారంభం కానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో హైస్పీడ్ రైలు వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరీక్షలు జరగనున్న మొట్టమొదటి మార్గం ఇదే కావడం విశేషం.ఈ మార్గానికి సంబంధించి విద్యుద్దీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని రైల్వే మంత్రి తెలిపారు. ఎలివేటెడ్ ట్రాక్‌పై ఉన్న అప్, డౌన్ లైన్లకు నవంబర్ 20న విజయవంతంగా విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ కారిడార్ కోసం అత్యాధునిక 2ఞ25 కేవీ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బిలిమోరా వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఇక ఈ సెక్షన్‌లో మిగిలి ఉన్న సిగ్నలింగ్ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టును దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అహ్మదాబాద్ నుంచి వాపీ వరకు ఉన్న విభాగాన్ని 2027 చివరి నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అనంతరం 2029 నాటికి ఈ సేవలను మహారాష్ట్రలోని థానే వరకు విస్తరించనున్నారు. దేశంలో మొట్టమొదటి కమర్షియల్ హైస్పీడ్ రైలు సర్వీస్ 2027 చివరి త్రైమాసికంలోనే ప్రారంభం - మిగతా 2 లో

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల
ఆర్థిక సాయం



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యం
- భారత్-నేపాల్ ప్రధానుల సంయుక్త ప్రకటన చేశారు
- ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేందర్ షా సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నారు

ఢిల్లీ :

నేపాల్‌లో అభివృద్ధి పనులకు భారత్ రూ. 24 వేల కోట్ల సాయం అందించనుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యంగా భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని బాలేంద్ర షా దిల్లీలోని - మిగతా 2 లో



పాకిస్థాన్‌లో తీవ్ర
గ్యాస్ సంక్షోభం

- వంట చేసుకోలేక ప్రజల అవస్థలు
- వంట గ్యాస్ కొరతతో ఆకాశాన్నంటిన ఎల్పీజీ ధరలు
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో కిలో ఎల్పీజీ ధర 600 రూపాయలకు పైగా పెంపు
- గ్యాస్ దొరక్క వంట కోసం కట్టెలు, బొగ్గు వాడుతున్న నగరవాసులు

ఢిల్లీ :

పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం రోజురోజుకు తీవ్ర తరమవుతోంది. ముఖ్యంగా ఖైబర్ - మిగతా 2 లో

విశాఖలో
ఆసియాన్-ఇండియా సదస్సు



- బ్లూ ఎకానమీపై నారా లోకేశ్ కీలక ప్రసంగం
- విశాఖలో ఘనంగా ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు
- ఏపీని గ్లోబల్ మారిటైమ్ గేట్‌వేగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- రాష్ట్రంలో శరవేగంగా నాలుగు నూతన పోర్టుల నిర్మాణం

వెస్ట్ బెంగాల్ పేరు
పశ్చిమ్ బంగా!

- వెస్ట్ బెంగాల్ పేరు మార్పునకు రంగం సిద్ధం
- వెస్ట్ బెంగాల్ పేరును పశ్చిమ్ బంగాగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం
- డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారికంగా తీర్మానం ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- జాతీయ సదస్సుల్లో ప్రాధాన్యత దక్కేందుకే అక్షర క్రమం మార్పు - మిగతా 2 లో

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన
కొత్త పాలకవర్గాలు

- అట్టహాసంగా సాగిన ప్రమాణ స్వీకారాలు
- ఏపీలో 13 నగర పాలక సంస్థలకు సంబంధించి , మేయర్లుకార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు
- అనంతరం డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకున్నారు
- విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా ప్రమాణ స్వీకారం



అమరావతి :

ఏపీలో తొలివిడతలో ఎన్నికలు జరిగిన 13 మున్సిపల్ కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు ఇవాళ కొలువుదీరాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు మేయర్లు, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. సభ్యుల ప్రమాణ స్వీకార ప్రక్రియ ముగిసిన వెంటనే డిప్యూటీ మేయర్లను పరోక్ష పద్ధతిలో చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇవాళ్టి నుంచే సభ్యుల పదవీకాలం ఐదేళ్ల పాటు ఉండనుంది.విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం 1. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా జనసేన నేత వంగవీటి రాధాకృష్ణ ప్రమాణం చేశారు. ఈ మేరకు వీఎంసీ కార్యాలయంలో అభిమానులు, కూటమి కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నగరంలోని 86 వార్డుల కార్పొరేటర్ల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. విజయవాడ నగర ప్రథమ పౌరుడిగా వంగవీటి ప్రమాణం చేయడంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా 12వ వార్డు సభ్యులు చెన్నుపాటి కాంతిశ్రీ - మిగతా 2 లో

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత
నిర్ణయాలే కీలకం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ సమీక్ష
- వైద్యం వ్యవసాయ రంగాల్లో ఏఐ వినియోగానికి సీఎం ఆదేశం
- ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టీకరణ
- డేటా ఆధారిత నిర్ణయాలతోనే పాలనలో మెరుగైన ఫలితాలు అని వెల్లడి
- ఉద్యోగుల పనితీరు పెంపునకు ప్రత్యేక శిక్షణ



అమరావతి :

వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని పాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

మంగళవారం 24 - 11 - 2026

సంపాదకీయం

ముగ్గురి ముచ్చట్లు...!

మూడు అతిపెద్ద అణ్వాయుధ దేశాల అధినేతలు ఒకే వేదికమీదకు రావడం, ఎదురెదురుగా కూర్చొని గంటన్నరకు పైగా మాట్లాడుకోవడం ఒక వింత. రెండో ప్రపంచయుద్ధం తరువాత అమెరికా, రష్యా, చైనా అధినేతల తొలి త్రైపాక్షిక భేటీ ఇది. ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ సంక్షోభం, ఎడతెరిపి లేకుండా సాగుతున్న వాణిజ్య యుద్ధాల కాలంలో ఈ అగ్రరాజ్యాధినేతల మధ్య నేరుగా సంభాషణ జరగడం ఒక కీలక ఘట్టం. ప్రపంచాధిపత్యం కోసం పోటీపడుతున్న రెండు ఆర్థికశక్తుల నుంచి పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకోవడం వంటి మాటలు రావడం వినసొంపుగా ఉంటుంది. నాలుగు అంశాల 'శాంతి ప్రకటన' తాత్కాలికంగానైనా ఓదార్పునిస్తుంది.ఈ మువ్వురి భేటీని 'యాల్టా 2.0' అన్నారు కొందరు. ఆర్భాటం ఎక్కువ, ఫలితం తక్కువ అని పెదవి విరిచారు మరికొందరు. రష్యా, చైనా అధ్యక్షులతో అమీతుమీ తేల్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నా, ట్రంప్ లక్ష్యం అది కాదు కాబట్టే ఈ భేటీ అంత ఘనంగా, సవ్యంగా సాగిపోయిందన్నవారూ ఉన్నారు. మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బతిని, ఇంట ఓడిన ఆయన రచ్చ గెలవాలనుకోవడం సహజం. మూడురోజుల ఆసియా పర్యటన, అందులో రెండు సదస్సులు, ఈ త్రైపాక్షిక భేటీ ఆయనకు ఉపశమనం కలిగిస్తాయి. జిన్‌పింగ్ ఆదరణ, ఆ హడావుడి, అట్టహాసం, వేలాదిమంది ఘనస్వాగతం తన పర్యటన విజయవంతమైందని చెప్పడానికి నిదర్శనాలన్నారాయన వెనక్కు తిరిగి వెడుతూ. ఇంతకు మించి ఆయన కోరుకున్నది ఏమీ లేదు. జిన్‌పింగ్‌ను ఆలింగనం చేసుకోవడం, పుతిన్‌ను క్లోజ్‌ఫ్రెండ్ అనడం అమెరికా రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఆగ్రహం కలిగించింది. భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులను ఇలా ఆకాశానికి ఎత్తేయడం, ఒక ప్రపంచవేదికమీద రష్యాను అమెరికాతో సమానం చేయడం విమర్శలకు తావిస్తోంది. మధ్యంతర ఎన్నికల్లో ఓడిన అమెరికా గతకాలపు అధ్యక్షులు కూడా ఇలా విదేశీపర్యటనలు చేసినవారే. అయితే, వ్యక్తిగతంగా కానీ, దేశానికి కానీ ఎక్కువకాలం ఆ ప్రయోజనాలు నిలబడలేదని కొందరు గుర్తుచేస్తున్నారు.ఈ భేటీ వెనుక ఎవరి ప్రయోజనాలు వారివి. అమెరికా, రష్యా అధినేతలను పిలిచి, వారి మధ్య నిలబడి, ప్రపంచ రాజకీయాలకు తానే కేంద్రబిందువు అనిపించుకున్నారు జిన్‌పింగ్. అమెరికాతో ఘర్షణపడకుండా చైనా విస్తరణ, ఆధిపత్యం కొనసాగితే చాలు ఆయనకు. పాశ్చాత్యదేశాలన్నీ తనను ఒంటరి చేసినా, ఈ ఇద్దరితో సమానంగా గౌరవాన్ని అందుకుంటూ, రష్యా ఇప్పటికీ ఎప్పటికీ అగ్రరాజ్యమేనన్న గుర్తింపు పుతిన్‌కు దక్కింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పరిధిని కట్టడి చేయాలన్న అంశాన్ని ఉమ్మడి ప్రకటనలో చేర్చడం ఆయనకు మరింత ఓదార్పును ఇచ్చింది. ఇజ్రాయెల్ మాజీ ప్రధాని నెతన్యాహూకు కూడా ఈ హేగ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది కనుక ట్రంప్‌కు కూడా అదంటే ఎలాగూ గిట్టదు. ప్రపంచదేశాల ప్రయోజనాలు, చమురు ధరల స్థిరత్వం పేరిట చేసిన నిర్ణయాలు, ప్రమాణాలూ రష్యాకే అధికంగా ఉపకరిస్తాయి కనుక పుతిన్‌కు ఇక అడ్డంకులు లేనట్టే. రష్యా చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటున్న ఉక్రెయిన్‌కు ఇంధన భద్రత అన్నమాట ఒక హెచ్చరిక.ఐదేళ్ళుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం, ఏడాదికి చేరువవుతున్న ఇరాన్ యుద్ధం ఇటువంటి భేటీల తరువాత ముగిసిపోతాయన్న భ్రమ ఎవరికీ లేదు.

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

మొదటిపేజీ తరువాయి - ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు కావాల్సిన కోరం ఉండటంతో కార్యక్రమాన్ని కొనసాగించిన ప్రిసైడింగ్ అధికారి ఉదయం 10 గంటల వరకూ డిప్యూటీ మేయర్ స్థానానికి కేవలం ఒకే అభ్యర్థిత్వం ఉన్నట్లు ప్రకటించారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కార్యక్రమాన్ని చేపట్టగా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు చెన్నుపాటి కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా 4వ డివిజన్ కార్పొరేటర్ దేవానంద్ కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. దీంతో చెన్నుపాటి కాంతిశ్రీ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ప్రకటించి ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

2. విజయనగరం నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా అవనాపు భార్గవి, డిప్యూటీ మేయర్‌గా ప్రసాదుల రజని బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారానికి ముందు మేయర్ భార్గవి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్పొరేటర్లతో కలిసి టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు తేజ్ భరత్ పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయించారు. అనంతరం 25వ వార్డు టీడీపీ కార్పొరేటర్ ప్రసాదుల రజని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

3. ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ కొలువుదిరింది. 62 మంది కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ రెడ్డి అప్పలనాయుడు మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ మేయర్, కార్పొరేటర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రెడ్డి అప్పలనాయుడును కార్పొరేటర్లు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఘనంగా సన్మానించారు.

4. మచిలీపట్నం మేయర్, కార్పొరేటర్ల ఎన్నిక అట్టహాసంగా జరిగింది. మచిలీపట్నం కార్పొరేషన్ సమావేశ భవనంలో నగరపాలక సంస్థ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్ డీకే బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత, మేయర్ అబ్దుల్ అబీదా ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం వరుస క్రమంలో 60మంది కార్పొరేటర్లు చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం, కొట్టె వెంకటరావుని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

5. గుంటూరు మేయర్‌గా కోవెలమూడి లక్ష్మీఅపర్ణ ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా యర్రంశెట్టి రాజేశ్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అనంతరం లక్ష్మీఅపర్ణ, రాజేశ్‌తో పాటు కార్పొరేటర్లతో కలెక్టర్ సాయికాంత్ వర్మ ప్రమాణం చేయించారు.

6. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను ఆ పార్టీ కైవసం చేసుకుంది. మేయర్‌గా నల్లమల్లి శ్రీశిల్ప ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా చావలి చార్వాక ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 62 డివిజన్లున్న ఒంగోలు కార్పొరేషన్‌లో తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన 24 ఏళ్ల చార్వాక డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవడం విశేషం. చిన్న వయసులోనే కీలక బాధ్యతలు చేపట్టిన ఆమె విజయం యువత రాజకీయాల వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తిగా నిలవనుంది.

7. నెల్లూరు నగర పాలక సంస్థ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. మేయర్‌గా ఎన్నికైన రూప్ కుమార్ యాదవ్‌తోపాటు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో ప్రిసైడింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతం డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించగా బీజేపీకి చెందిన 60వ డివిజన్ కార్పొరేటర్ రఘునాథరాజు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు రూప్ కూమార్‌ను మేయర్ సీటులో కూర్చోపెట్టారు. అందరి సహకారంతో నెల్లూరులో అభివృద్ధి చేస్తామని వారు ప్రకటించారు.

8. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ గా మన్నెం శ్రీనివాసప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. తిరుపతి ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు 66 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు, మేయర్ అభ్యర్థి శ్రీనివాసప్రసాద్‌తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

9. చిత్తూరు మేయర్‌గా కఠారి హేమలత డిప్యూటీ మేయర్‌గా గోపీనాథ్ బాధ్యతలు స్వకరించారు. వారిద్దరితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

10. వైఎస్సార్ కడప నగరపాలక సంస్థ మేయర్‌గా సువర్ణ ప్రమాణస్వీకారం చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మేయర్ సహా కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. డిప్యూటీ మేయర్‌గా టీడీపీ కార్పొరేటర్ మన్సూర్ ఆలీఖాన్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సహా టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11. కర్నూలు నగరపాలక సంస్థ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు మేయర్ బొల్లెద్దుల ప్రత్యూష తొలుత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ అంబలి కాశీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు.

12. అనంతపురం కార్పొరేషన్‌లో 62 డివిజన్ల నుంచి గెలుపొందిన కార్పొరేటర్లు, నగర మేయర్‌గా రమేశ్‌బాబు ప్రమాణం స్వీకారం చేసి పదవులు చేపట్టారు. ఈ మేరకు వారితో ఈ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రమాణం చేయించారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం టీడీపీ నుంచి టి. స్వాతి నామినేషన్ దాఖలు చేసి, బీ-ఫారం అందించారు. డిప్యూటీ మేయర్ పదవికి కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్‌కు ముందుకు రాకపోవడంతో స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆనంద్ ప్రకటించారు. అనంతరం ఆమెతో డిప్యూటీ మేయర్‌గా ప్రమాణం చేయించారు.

13. మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్‌గా ముక్కా శ్రావణి ప్రమాణ స్వీకారంలో పాల్గొనలేదు. ఆమె తండ్రి ముత్యాలనాయుడు ఈ నెల 20న కన్నుమూశారు. శ్రావణి విజ్ఞప్తి మేరకు పాలకవర్గం ఏర్పాటైన మొదటి మూడు నెలల్లో లేదా మొదటి మూడు కౌన్సిల్ సమావేశాల్లో ఆమె మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయొచ్చని ఎస్ఈసీ ఉత్తర్వులిచ్చింది.దీంతో విశాఖ డిప్యూటి మేయర్‌గా పందిరి శివవెంకట ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన ఆయన్ని ఎంపీ శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలపడంతో శివవెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అంతకుముందు కార్పొరేటర్లందరితో జీవీఎంసీ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించారు.

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం

మొదటిపేజీ తరువాయి - ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆయా శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాలను మెరుగుపర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలు (డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్) అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తుచేశారు.ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తికరమైన సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రతి శాఖ కూడా తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, పురపాలక, ఇంధన శాఖల ఉన్నతాధికారులు మరియు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బుల్లెట్ రైలు ట్రయల్ రన్ కు ముహూర్తం ఫిక్స్

మొదటిపేజీ తరువాయి - అవుతుందని మంత్రి వివరించారు.ప్రారంభ దశలో నిర్వహించే ట్రయల్స్ కోసం ప్రత్యేకంగా 'బి-28' రైలును వినియోగించనున్నారు. ఈ రైలు గరిష్ఠంగా గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేశారు.సాధారణంగా గంటకు 240 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్లే రైళ్లను హైస్పీడ్ కేటగిరీగా పరిగణిస్తారు. వీటికి అత్యున్నత ఇంజనీరింగ్, కఠినమైన నిర్మాణ ప్రమాణాలు తప్పనిసరి. ఇంతటి అమిత వేగంతో దూసుకెళ్లే సమయంలో ఉత్పన్నమయ్యే గాలి పీడనాన్ని రైలు బోగీలు, ట్రాక్ మౌలిక వసతులు తట్టుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బి-28 రైలు ఇప్పటికే క్లిష్టమైన 'స్వింజ్ టెస్ట్'ను విజయవంతంగా అధిగమించిందని మంత్రి చెప్పారు. సాధారణ పరిస్థితుల కంటే రెండు రెట్ల వాతావరణ పీడనాన్ని సైతం తట్టుకునే సామర్థ్యాన్ని ఈ రైలు నిరూపించుకుందని ఆయన తెలిపారు.మరోవైపు మహారాష్ట్ర పరిధిలోని పనులు కూడా వేగంగా పురోగతి సాధిస్తున్నాయని, ముఖ్యంగా సముద్రగర్భ సొరంగం (అండర్‌సీ టన్నెల్) నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి వెల్లడించారు. మొత్తం 508 కిలోమీటర్ల నిడివితో నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టు ద్వారా దేశ ఆర్థిక కేంద్రాలైన ముంబై, అహ్మదాబాద్ నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఇక కేవలం ఆలోచనలకే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటూ పట్టాలెక్కే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

పాకిస్థాన్‌లో తీవ్ర గ్యాస్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలోని సుయ్ గ్యాస్ (పైప్‌లైన్ గ్యాస్) సరఫరాలో భారీ కోతలు విధించడంతో వంట చేసుకోవడానికి కూడా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం, ప్రత్యామ్నాయ ఇంధనమైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) ధరలు ఆకాశాన్నంటడం వారిని మరింత కుంగదీస్తోంది.'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో గ్యాస్ కొరత తీవ్ర స్థాయికి చేరింది. ఇళ్లలో గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎల్పీజీ సిలిండర్ల వాడకం ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగి, కిలో ఎల్పీజీ ధర 380 పాకిస్థానీ రూపాయల నుంచి 600 రూపాయలకు చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధర 620 రూపాయల వరకు పలుకుతోంది. మరోవైపు, సీఎన్‌జీ కోసం పెషావర్‌లోని బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. సీఎన్‌జీ దొరక్క ఆటో రిక్షా డ్రైవర్లు కూడా ఎల్పీజీ వాడటం మొదలుపెట్టడంతో డిమాండ్, ధరలు మరింత పెరుగుతున్నాయి.ఈ గ్యాస్ కష్టాలు కేవలం ఖైబర్ పఖ్తుంఖ్వాకే పరిమితం కాలేదు. ఇస్లామాబాద్, రావల్పిండి వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 'ఆయిల్ అండ్ గ్యాస్ రెగ్యులేటరీ అథారిటీ' (ఓజీఆర్ఏ) కిలో ఎల్పీజీ ధరను 279 రూపాయలుగా నిర్ణయించినప్పటికీ, డీలర్లు 600 రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్యాస్ కొరత, ధరల పెరుగుదలతో చాలా కుటుంబాలు వంట కోసం కట్టెలు, బొగ్గును ఆశ్రయిస్తున్నాయని 'డాన్' పత్రిక వెల్లడించింది."రోజుకు కేవలం ఆరు గంటలు, అదీ ఉదయం 7 నుంచి 9, మధ్యాహ్నం 12 నుంచి 2, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు మాత్రమే గ్యాస్ వస్తోంది" అని ఓ స్థానికుడు వాపోయాడు. పరిస్థితి మరింత దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని, ఎల్పీజీ ధరలను నియంత్రించి, అధిక ధరలకు అమ్ముతున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెస్ట్ బెంగాల్ పేరు పశ్చిమ్ బంగా!

మొదటిపేజీ తరువాయి - పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పేరును మార్చేందుకు అక్కడి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆంగ్ల నామమైన 'వెస్ట్ బెంగాల్' స్థానంలో బెంగాలీ పేరైన 'పశ్చిమ్ బంగా'ను అధికారికంగా ఖరారు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారిక తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు.కోల్‌కతాలోని సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీ అనంతరం సీఎం వివరాలు వెల్లడించారు. "ఇకపై ఆంగ్లంలో కూడా రాష్ట్రాన్ని 'పశ్చిమ్ బంగా' అనే పిలుస్తారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని డిసెంబర్ 9న అసెంబ్లీలో ప్రవేశపెడతాం. సభ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటరీ, చట్టపరమైన ప్రక్రియల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పేరు మార్పు వెనుక బలమైన పాలనాపరమైన కారణం కూడా ఉంది. ప్రస్తుత పేరు ఆంగ్ల అక్షరమాల ప్రకారం 'ఔ' (డౌవర్ దీవఅస్ఫుశ్రీ)తో ప్రారంభమవుతోంది. దీనివల్ల జాతీయ స్థాయి సమావేశాలు, ముఖ్యమంత్రుల సదస్సులలో బెంగాల్ ప్రతినిధులకు చివరి వరుసలో మాట్లాడే అవకాశం వస్తోంది. దీనివల్ల సమయం సరిపోక రాష్ట్ర వాణిని బలంగా వినిపించలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించి, అల్ఫాబెటికల్ జాబితాలో ముందు వరుసలోకి వచ్చేలా ఏ'తో మొదలయ్యేలా 'పశ్చిమ బంగా' పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ సవరణ కోసం కేంద్ర ఆమోదానికి పంపనున్నారు.

విశాఖలో ఆసియాన్-ఇండియా సదస్సు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సముద్ర వాణిజ్యం, పారిశ్రామిక రంగానికి ప్రధాన గేట్‌వేగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో ఇండియా ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సముద్ర మార్గాల అనుసంధానత, సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఆగ్నేయాసియా దేశాలతో ఆంధ్రప్రదేశ్ బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఆయన తెలిపారు.విశాఖపట్నానికి గొప్ప సముద్ర చరిత్ర ఉందని, ఈ నగరం తూర్పు నౌకా దళానికి (ఈస్టర్న్ నేవల్ కమాండ్) ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు శరవేగంగా ఐటీ, వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద తీరప్రాంతం (దాదాపు 1,053 కిలోమీటర్లు) కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు 91.17 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి దాదాపు 10 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు సృష్టించిందని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రంలో సముద్ర రవాణా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలలో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని లోకేశ్ తెలిపారు. ఈ పోర్టులు ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో దాదాపు రూ. 30,000 కోట్ల భారీ పెట్టుబడితో ప్రధాన షిప్‌బిల్డింగ్ (నౌకా నిర్మాణ) క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలోనే విశాఖ కేంద్రంగా పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, ప్రత్యేక టెర్మినల్స్, షిప్ రిపేరింగ్ రంగాల్లో రూ. 7,500 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదిరాయని తెలిపారు. పోర్టులను పరిశ్రమలతో అనుసంధానించడం, తద్వారా ఆ పరిశ్రమల ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్లకు చేర్చడమే తమ వ్యూహమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను లోకేశ్ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం బ్లూ ఎకానమీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 వంటి బృహత్తర కార్యక్రమాలు దేశ ప్రగతికి బాటలు వేస్తున్నాయని చెప్పారు. నౌకా నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ రూ. 25,000 కోట్ల డెవలప్‌మెంట్ ఫండ్‌తో కలిపి మొత్తం రూ. 70,000 కోట్ల భారీ ప్యాకేజీని ఆమోదించిందని గుర్తుచేశారు. దేశీయ వాణిజ్యంలో 95 శాతం సరుకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతున్నందున, అత్యాధునిక పోర్టుల నిర్మాణం ద్వారా వ్యాపార, పారిశ్రామిక రంగాలకు, ముఖ్యంగా యువత ఉపాధికి విస్తృత అవకాశాలు లభిస్తాయని లోకేశ్ స్పష్టం చేశారు.

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్ హౌజ్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. భారత్- నేపాల్ భాగస్వామ్యంతో చేపట్టే అనేక ప్రాజెక్టులపై ఇరుదేశాల నేతలు చర్చించారు. రైలు, రోడ్డు కనెక్టివిటీ వంటి ప్రాజెక్టులకు సంబంధించి పలు ఒప్పందాలు చేసుకున్నట్లు భేటీ తర్వాత మోదీ, బాలేంద్ర సంయుక్తంగా ప్రకటించారు.నేపాల్‌లో స్టార్టప్ ఇంక్యుబేటర్, ఐఐటీ హబ్ ఏర్పాటు చేస్తామన్న మోదీ ఝాపా ప్రాంతంలో గ్రీన్ ఆయిల్ స్టోరేజ్ టెర్మినల్ నిర్మిస్తామని తెలిపారు. మోతిహరీ పైప్‌లైన్ ప్రాజెక్టు సహా బన్బాసా ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు నేపాల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. మహాకాళి నదిపై మోటరబుల్ వంతెన నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు మోదీ వివ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 - 11 - 2026

8వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా..

కౌన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయి చరణ్



గుంతకల్లు నవంబర్ 23 తెలుగు కలం :- గుంతకల్లు మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం కొలువుదీరిన సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్‌గా సాయి చరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకంతో ఎన్నికల్లో విజయం సాధించి,ఇప్పుడు అధికారికంగా కౌన్సిలర్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా సాయి చరణ్ మాట్లాడుతూ.... తన రాజకీయ ప్రస్థానంలో మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనివని అన్నారు.ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచి, విజయం కోసం నిరంతరం కృషి చేసిన తండ్రి మహదేవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తన గెలుపునకు సహకరించిన వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత :-

8వ వార్డు ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని సాయి చరణ్ స్పష్టం చేశారు. కౌన్సిలర్‌గా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తూ వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధిగా పదవి పొందడం కంటే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ,8వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని సాయి చరణ్ వెల్లడించారు.

ప్రజల నమ్మకమే నా బలం..

7వ వార్డు అభివృద్ధే నా లక్ష్యం!

కౌన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాంబశివ.. ప్రజలకు అందుబాటులో ఉంటా



గుంతకల్లు, నవంబర్ 23, తెలుగు కలం: గుంతకల్లు మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం కొలువుదీరిన నేపథ్యంలో 7వ వార్డు కౌన్సిలర్‌గా సాంబశివ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన వార్డు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ..

తన రాజకీయ ప్రస్థానంలో మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో విలువైనవని అన్నారు. ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచి విజయం కోసం కృషి చేసిన మిత్రులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరించి గెలిపించిన 7వ వార్డు ప్రజల రుణం ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి పెద్దపీట..

కౌన్సిలర్‌గా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని సాంబశివ తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజాప్రతినిధిగా పదవి పొందడం కంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తనకు ముఖ్యమని, ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని వెల్లడించారు. 7వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని సాంబశివ స్పష్టం చేశారు.

39వ వార్డు కౌన్సిలర్‌గా వాల్మీకి పవన్

బాధ్యతల స్వీకారం.. ప్రజాసేవే ధ్యేయమని వెల్లడి

మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహం, ప్రజల మద్దతుతో రాజకీయ విజయం



గుంతకల్లు నవంబర్ 23 తెలుగుకలం :- గుంతకల్లు మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీకి మరోసారి ప్రజల మద్దతు లభించింది. 39వ వార్డు నుంచి విజయం సాధించిన వాల్మీకి పవన్ నూతన మున్సిపల్ పాలకవర్గం ప్రమాణ స్వీకార వేడుకలో కౌన్సిలర్‌గా ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల బరిలో తనకు అండగా నిలిచిన గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి సహకారం, స్థానిక ప్రజలు అందించిన ఆదరణ తన విజయానికి ప్రధాన కారణమని పవన్ పేర్కొన్నారు. తనను గెలిపించేందుకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక :-

కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వాల్మీకి పవన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటలను కార్యరూపంలో పెట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.39వ వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.ప్రజలకు సమస్య వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే ప్రజాప్రతినిధిగా ఉండటమే తన ఆకాంక్ష అని, కౌన్సిలర్‌గా ఐదేళ్ల పాటు ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తానని పవన్ పేర్కొన్నారు. తన రాజకీయ విజయానికి తోడ్పడిన మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి సహా ప్రతి ఒక్కరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.

అనంతపురం నగరపాలక సంస్థ ప్రత్యేక

సమావేశం మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం

అనంతపురం నవంబర్ 23







తెలుగుకలం : అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం 'అనంతపురం నగరపాలక సంస్థ ప్రత్యేక సమావేశం – 2026' ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో భాగంగా నూతన మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారంతో పాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరవ ప్రిసైడింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధ్యక్షతన ఈ ప్రత్యేక సమావేశం కొనసాగింది. కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ముందుగా మేయర్ చేత, ఆ తర్వాత కార్పొరేటర్లందరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో సభ్యులైన అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, సంబంధిత మున్సిపల్ అధికారులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

నిఖిల్ సాయి స్మారక హాకీ టోర్నమెంట్ ఘనంగా ముగింపు!

బాలికల విభాగంలో ఈసీఎం గర్ల్స్ హైస్కూల్ విజయం.. బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ మీదివేముల జట్టుకు ప్రథమ స్థానం



కర్నూలు, (తెలుగు కలం) (నవంబర్ 23) : హాకీ కర్నూలు అడ్హాక్ కమిటీ, రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నిఖిల్ సాయి మెమోరియల్ స్కూల్ లెవెల్ **11-A-Side** హాకీ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. కర్నూలులోని ఎస్‌టిబీసీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు కళాశాల ప్రిన్సిపాల్ సునీతా రోజ్, క్లబ్ చైర్మన్ మదాసి కురువ సుంకన్న, ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయలసీమ రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో ఈసీఎం గర్ల్స్ హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ మీదివేముల జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, విద్యానగర్ మౌంటేశ్వరి జట్టు ద్వితీయ స్థానం, జెడ్పీహెచ్ఎస్ మునగాలపాడు జట్టు తృతీయ స్థానం సాధించాయి. పోటీల అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ నిఖిల్ సాయి తండ్రి నరసింహ రాజు మాట్లాడుతూ.. తన కుమారుడి జ్ఞాపకార్థం హాకీ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల ద్వారా పాఠశాల స్థాయి క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశం లభించిందని తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాబోయే రోజుల్లో కూడా మరిన్ని హాకీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాకీ కర్నూలు అడ్హాక్ కమిటీ, రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో హాకీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని, పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన నిఖిల్ సాయి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైజింగ్ స్టార్స్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు అరుణ్ రవికుమార్, అధ్యక్షుడు మదాసి కురువ భరత్ కుమార్, కార్యదర్శి కె. రాము, కోశాధికారి బి. మురళి, నెక్స్ట్ జెన్ హాకీ క్లబ్ కార్యదర్శి నవ్య రాజేశ్వరి, అనిత, అల్విష తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు మున్సిపాలిటీకి కొత్త సారథ్యం.. యశోద గౌడ్, సాయి ప్రసాద్‌కు పగ్గాలు....!

ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్.. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రమాణం

48 మంది కౌన్సిలర్లతో నూతన పాలకవర్గం కొలువుదీరింది..

అభివృద్ధి హామీల అమలుపైనే ప్రజల దృష్టి

గుంతకల్లు నవంబర్ 23 తెలుగు కలం :- గుంతకల్లు మున్సిపల్ పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రజాప్రతినిధులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించడంతో మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పాటైంది. చైర్‌పర్సన్‌గా ఆర్. యశోద గౌడ్, వైస్ చైర్‌పర్సన్‌గా ముక్కన్నగారి సాయి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు



జయరాం ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు.

ఎన్టీఆర్‌కు నివాళులు.. ర్యాలీతో హడావుడి

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కూటమి నాయకులు ఎన్టీఆర్ సర్కిల్‌లోని దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల నినాదాలతో పట్టణంలో రాజకీయ సందడి కనిపించింది.



48 మంది కౌన్సిలర్లతో కొత్త పాలకవర్గం

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు నూతన చైర్‌పర్సన్ ఆర్.యశోద గౌడ్‌తో పాటు 48 మంది కౌన్సిల్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముక్కన్నగారి సాయి ప్రసాద్ కూడా ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడంతో నూతన పాలకవర్గం అధికారికంగా కొలువుదీరింది.

సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే జయరాం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆదరణ పొందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ప్రసంగాలు కాదు.. అభివృద్ధి పనులే సమాధానం కావాలి!

కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో గుంతకల్లు ప్రజల్లో అభివృద్ధిపై అంచనాలు పెరిగాయి. అయితే పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ఇప్పుడు నూతన ప్రజాప్రతినిధులపై ఉంది.ప్రతి వార్డులో పర్యటించి ప్రజల



సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, అవసరమైన నిధులు సమకూర్చుకోవడం, అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయడం పాలకవర్గం ముందున్న ప్రధాన కర్తవ్యం. పదవులు చేపట్టడం ఒక ఘట్టమైతే.. ప్రజలకు కనిపించేలా అభివృద్ధి చేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన సవాలు.

ఐదేళ్ల పాలనకు ఇదే తొలి పరీక్ష!

చైర్‌పర్సన్ యశోద గౌడ్, వైస్ చైర్‌పర్సన్ సాయి ప్రసాద్‌తో పాటు ప్రతి కౌన్సిలర్ తమ తమ వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారంతో పట్టణానికి అవసరమైన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులకు వేగం పెంచాలి.ప్రమాణ స్వీకార వేదికపై చేసిన ప్రతిజ్ఞలు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చినప్పుడే ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. కొత్త పాలకవర్గం గుంతకల్లు అభివృద్ధికి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుంది? ప్రజల ఆశలను ఎంతవరకు నెరవేరుస్తుంది? అనేది రానున్న కాలమే నిర్ణయించనుంది.ఈ కార్యక్రమంలో గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, ఆర్. శ్రీనాథ్ గౌడ్, ఆర్. పవన్ కుమార్ గౌడ్, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి, నూతన పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనేకల్ మేజర్ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో అన్వర్ సాదత్ ముమ్మర పర్యటన

కనేకల్ మేజర్ పంచాయతీ ఎన్నికలు

కీలకంగా మారిన మైనార్టీ ఓటర్ల తీర్పు

కనేకల్ (తెలుగు కలం) (నవంబర్ 23) : కనేకల్ మేజర్ పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అన్వర్ సాదత్ తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అన్వర్ సాదత్‌ను వైసీపీ నాయకత్వం బరిలోకి దించడంతో, పార్టీ శ్రేణులు మరియు స్థానిక నాయకులు ఆయనకు మద్దతుగా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు.పంచాయతీ పరిధిలోని ప్రతి వార్డులో అన్వర్ సాదత్ తన కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి గడపకూ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, తన ఎన్నికల గుర్తు అయిన 'మంచం' గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కనేకల్ మేజర్ పంచాయతీలో దీర్ఘకాలంగా నెలకొన్న మౌలిక వసతులు, పారిశుధ్యం



మరియు తాగునీటి సమస్యలను తాను గెలిచిన వెంటనే పరిష్కరిస్తానని ఆయన ప్రజలకు హామీ ఇస్తున్నారు.ఈ సందర్భంగా అన్వర్ సాదత్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్త అయిన తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి, కనేకల్ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని పేర్కొన్నారు.కనేకల్ పట్టణంలో ముస్లిం మైనార్టీ ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉండటంతో,



ఈ ఎన్నికల్లో వారి ఓట్లు గెలుపోటములను నిర్ణయించే కీలక అంశంగా మారాయని స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకునే, అందరికీ సుపరిచితుడు మరియు సౌమ్యుడిగా పేరున్న అన్వర్ సాదత్‌ను వైసీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి అన్వర్ సాదత్ విజయం ఖాయమని వైసీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

రాయదుర్గం మున్సిపల్ పాలకవర్గం కొలువుదీరింది

చైర్మన్‌గా టంకశాల హనుమంతు,

వైస్ చైర్మన్‌గా మహబూబ్ భాష ప్రమాణ స్వీకారం

అట్టహాసంగా సాగిన కూటమి శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

రూ.260 కోట్లతో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : రాయదుర్గం మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సమక్షంలో మున్సిపల్ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టంకశాల హనుమంతు, వైస్ చైర్మన్‌గా మహబూబ్ భాషతో పాటు 40 మంది వార్డు కౌన్సిలర్లు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నాయి. ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కూటమి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి నూతన చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి వినాయక సర్కిల్, లక్ష్మీ బజార్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నూతన చైర్మన్ టంకశాల హనుమంతుకు శు భాకాంక్షలు తెలిపేందుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో రాయదుర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న రాయదుర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నూతన కార్యవర్గంతో కలిసి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రాయదుర్గం పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.260 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరికొన్ని పురోగతిలో ఉండగా, ఇంకొన్ని త్వరలోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు.



పట్టణ ప్రజల కనీస అవసరాలైన వీధి దీపాలు, రహదారులు, మురుగునీటి కాలువలు, పారిశుధ్యం, తాగునీటి వసతిని మెరుగుపరచడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారుల విస్తరణ, బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి, మూడు ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ప్రతి వార్డు, కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పట్టణ సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నగరవనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో పార్కుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014లో తాను పోటీ చేసిన సమయంలో రాయదుర్గాన్ని 'పల్లెకు ఎక్కువ.. పట్టణానికి తక్కువ' అని విమర్శించేవారని గుర్తుచేసిన ఆయన, చాలాకాలం తర్వాత పట్టణానికి వచ్చే వారు సైతం ఆశ్చర్యపోయేలా నేడు రాయదుర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పురపాలక ఎన్నికల సమయంలో హింస, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్యబద్ధమైన వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. వైకాపా అభ్యర్థులు సైతం స్వేచ్ఛగా నామినేషన్లు వేసి ప్రచారం చేసుకునే అవకాశం కల్పించామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తే అది ప్రజలను కాపాడుతుందని ఈ ఎన్నికలు మరోసారి నిరూపించాయన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించిన రాయదుర్గం పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే చేతులెత్తి నమస్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గం సమష్టి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

చిత్రాల్లో వారసత్వం.. అక్షరాల్లో సంస్కృతి విద్యార్థుల్లో సృజనాత్మక చైతన్యం





అనంతపురం నవంబర్ 23 తెలుగుకలం : రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ కమిషనర్ శ్రీ ముత్యాలరాజు రేవు, ఐఏఎస్ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్, ఐఏఎస్ గారి నేతృత్వంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2026 ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం (23-11-2026) స్థానిక పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాలలో "మన వారసత్వం.... మన ఇంట్లో" అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ అనంతపురం మరియు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్ - **INTACH)** సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త అజిత్ కుమార్ మాట్లాడుతూ, వారసత్వం అంటే కేవలం పురాతన కట్టడాలు, శిల్పాలు లేదా చారిత్రక వస్తువులు మాత్రమే కాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, సంప్రదాయాలు, కుటుంబ విలువలు, ఆహారపు అలవాట్లు, పండుగలు, జానపద కళలు కూడా మన ఘన వారసత్వంలో అంతర్భాగమని ఆయన విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు (టెక్నికల్) శ్రీ యం. స్వామి నాయక్ మాట్లాడుతూ, "మన వారసత్వం.... మన ఇంట్లో" పోటీల ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు చక్కటి చిత్రరూపం, అక్షరరూపం కల్పించారని ప్రశంసించారు. మన ఇంటి సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వీకుల జీవనశైలి, ప్రాచీన వస్తువులు, పండుగల విశిష్టత, స్థానిక కళలు మరియు వారసత్వ పరిరక్షణ అవశ్యకత వంటి ఎన్నో కీలక అంశాలను విద్యార్థులు తమ రచనలు, చిత్రాల్లో అద్భుతంగా ప్రతిబింబించారని తెలిపారు. ఇంటాక్ **(INTACH)** ప్రతినిధి పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు చిత్రలేఖనం ద్వారా రంగుల్లో తమ భావాలను ఆవిష్కరించగా, వ్యాసరచన ద్వారా వారసత్వంపై తమకున్న అవగాహనను, ఆలోచనా దృక్పథాన్ని అక్షరబద్ధం చేశారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో కేవలం కళాత్మక నైపుణ్యాలను మాత్రమే కాకుండా చరిత్ర పట్ల ఆసక్తిని, సంస్కృతి పట్ల గౌరవాన్ని, వారసత్వ పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు తమ ఇళ్లలో ఉన్న అత్యంత ప్రాచీన వస్తువుల చిత్రాలను గీయడమే కాకుండా, వాటి చరిత్రను తెలుసుకుని వివరంగా వ్యాసాలు రాశారు. వారి తాతముత్తాతల కాలం నాటి జీవనశైలి, పాత వస్తువులు, సంప్రదాయ ఆహారపు అలవాట్లు, పండుగలు, పాతకాలపు ఆటలు, జానపద కళలతో పాటు కుటుంబ, సామాజిక నైతిక విలువలకు అద్దం పట్టేలా విద్యార్థులు వేసిన చిత్రాలు, రాసిన వ్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంటాక్ ప్రముఖులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మురళి కృష్ణ, రియాజ్, జూటూరు షరీఫ్, సూర్యనారాయణ రెడ్డి, సూర్య ప్రకాశ్ రెడ్డి, నాగభూషణం, గిరి ప్రసాద్, చంద్ర బాబు, పద్మ నారాయణరెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పేద విద్యార్థినికి అండగా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్

బీ ఫార్మసీ విద్యార్థిని మంజులకు రూ.30 వేల ఆర్థిక సాయం



శెట్టూరు (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే సదుద్దేశంతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా శెట్టూరు మండలం మాకొడికి తండాకు చెందిన నిరుపేద విద్యార్థిని మంజులకు ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ రూ.30 వేల ఆర్థిక సహాయం అందించి ఆమె విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. మాకొడికి తండాకు చెందిన సక్రె నాయక్, సాలమ్మ దంపతుల కుమార్తె మంజుల అనంతపురం పట్టణంలోని ఒక ప్రముఖ కళాశాలలో బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో రూ.38 వేల కళాశాల ఫీజు చెల్లించలేక ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఫీజు బకాయి కారణంగా కీలకమైన పరీక్షలకు హాజరయ్యే విషయంలోనూ ఆమెకు అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ తక్షణమే స్పందించి ఆ విద్యార్థినిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. తొలుత కళాశాల ప్రిన్సిపల్‌ను స్వయంగా సంప్రదించి మంజుల కుటుంబ నేపథ్యాన్ని, ఆర్థిక దుస్థితిని వివరించారు. ఫీజు చెల్లించేందుకు నాలుగు రోజుల గడువు ఇవ్వాలని ఆయన కోరడంతో, కళాశాల యాజమాన్యం సానుకూలంగా స్పందించి ఆమెను పరీక్షలు రాసేందుకు అనుమతించింది. అనంతరం ఇచ్చిన మాట ప్రకారం కళాశాల పేరు మీద రూ.30 వేల చెక్కును విద్యార్థిని కుటుంబ సభ్యులకు బద్దే నాయక్ అందజేసి, ఆమె ఉన్నత చదువులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేలా ఆర్థిక భరోసా కల్పించారు. బద్దే నాయక్ సేవా దృక్పథం కేవలం ఒక్క మంజులకే పరిమితం కాలేదు. అదే మాకొడికి తండాకు చెందిన మరో నలుగురు విద్యార్థినులతో కలిపి మొత్తం ఐదుగురు గిరిజన బాలికల ఉన్నత విద్యకు ట్రస్ట్ తరపున ఆయన చేయూతనిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆడపిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే లక్ష్యంతో అవసరమైన తోడ్పాటును అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లోని ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి స్వయం సమృద్ధి సాధించాలనే ఆశయంతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ మాట్లాడుతూ, చదువుకు పేదరికం ఎన్నటికీ అడ్డంకి కాకూడదని, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహేష్, వన్నప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల వినికిడి ఆరోగ్యానికి స్విమ్స్ ఆసరా

400 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు, పరికరాల పంపిణీ



తిరుపతి (తెలుగు కలం) (నవంబర్ 23) : దివ్యాంగ విద్యార్థుల్లో వినికిడి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ ప్రత్యేక చొరవతో, సంస్థలోని చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్య విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 23న ఈ ఉచిత వినికిడి పరీక్షల శిబిరం ప్రారంభమైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర చెవిటి పిల్లల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులతో పాటు, శ్రవణం విద్యాసంస్థల చిన్నారులకు కూడా ఈ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. ?విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది అని భావించిన డాక్టర్ గుడారు జగదీష్, చిన్నతనంలోనే వినికిడి లోపాలను గుర్తించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. బాల్యంలోనే వినికిడి సమస్యలను గుర్తించకపోతే పిల్లల మాటల అభివృద్ధి, భాషా నైపుణ్యాలు, చదువుపై ఏకాగ్రత మరియు సామాజిక సంబంధాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సుమారు 400 మంది విద్యార్థులకు వచ్చే 20 రోజుల పాటు, రోజుకు 20 మంది చొప్పున స్విమ్స్‌లో దశలవారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. టీటీడీ అధికారులు, స్విమ్స్ వైద్య సిబ్బంది పరస్పర సమన్వయంతో రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ వైద్య శిబిరంలో విద్యార్థుల చెవుల ఆరోగ్య స్థితిని అంచనా వేయడానికి అత్యంత ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. చెవి లోపలి భాగాన్ని పరిశీలించే ఓటోస్కోపీ, వినికిడి సామర్థ్యాన్ని కొలిచే ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ, మధ్య చెవి పనితీరును అంచనా వేసే టింపనోమెట్రీ మరియు చెవి నుంచి వెలువడే శబ్ద స్పందనలను గుర్తించే ఓటోఅకౌస్టిక్ ఎమిషన్స్ వంటి పరీక్షల ద్వారా చెవిలో గులిమి, ఇన్ఫెక్షన్లు, ద్రవం చేరడం, కర్ణభేరి లోపాలను నిపుణులు నిశితంగా పరిశీలిస్తున్నారు. చికిత్స ద్వారా నయం చేయగల ఇన్ఫెక్షన్లకు తక్షణమే మందులు అందిస్తూ, శాశ్వత వినికిడి లోపం ఉన్నట్లు తేలిన విద్యార్థులకు వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా వినికిడి పరికరాలను అందజేయడానికి స్విమ్స్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కేవలం పరికరాలు ఇవ్వడమే కాకుండా, వాటి వినియోగం మరియు సంరక్షణపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. స్విమ్స్ ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ అమర్‌నాథ్ పర్యవేక్షణలో వైద్యులు, ఆడియాలజిస్టులు ఈ సేవలను అందిస్తున్నారు. సకాలంలో అందించే ఈ వైద్య సహాయం వల్ల చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా, వారు ఉపాధ్యాయుల పాఠాలను సులభంగా అర్థం చేసుకుని తోటివారితో చక్కగా సంభాషించడానికి వీలవుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర చెవిటి పిల్లల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. గంగాధరరావు, విద్యా సమన్వయకర్త ఎ. సుబ్రహ్మణ్యం నాయుడు, కె. రంగనాథ్, కమల తదితరులు పాల్గొని విద్యార్థులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు.

కళ్యాణదుర్గం మండలంలో విషాదం

విషపూరిత గడ్డి మేసి భారీగా గొర్రెలు, ఆవు మృతి



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం బట్వానిపల్లి గ్రామంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ఓ తోటలో మేతకు వెళ్లిన మూగజీవాలు అకస్మాత్తుగా మృత్యువాత పడటంతో బాధిత రైతు కుటుంబాల్లో తీవ్ర ఆవేదన నెలకొంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన గొల్ల ఆంజనేయులుకు చెందిన ఒక జెర్సీ ఆవుతో పాటు 15 గొర్రెలు మృతి చెందాయి. వీరితో పాటు బోయ గంగాధర్, ఓబులపతి, తిమ్మప్ప, గొల్ల తిప్పేస్వామిలకు చెందిన మరికొన్ని గొర్రెలు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. మొత్తంగా సుమారు రెండు వేల వరకు గొర్రెలు ఆ తోటలోని గడ్డిని మేసినట్లు సమాచారం అందుతుండటంతో మిగిలిన జీవాల పరిస్థితిపై కాపరులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ మరణాలకు సంబంధించి ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. సదరు తోటలో పది రోజుల క్రితం గడ్డిపై విషద్రావకం పిచికారీ చేసినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఆ విషపూరిత గడ్డిని మేయడం వల్లే జీవాలు మృతి చెంది ఉంటాయనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పశువైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పోస్టుమార్టం మరియు గడ్డి నమూనాల పరీక్షలు నిర్వహిస్తేనే మృతికి గల అసలు కారణాలు అధికారికంగా నిర్ధారణ కానున్నాయి. తమ కన్నబిడ్డల్లా అల్లారుముద్దుగా పెంచుకున్న జీవాలు కళ్లముందే విగతజీవులుగా పడి ఉండటంతో బాధిత గొర్రెల కాపరులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేవలం పశుపోషణపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలకు ఈ ఘటన తీరని ఆర్థిక నష్టాన్ని మిగిల్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఘటనా స్థలాన్ని పరిశీలించాలని, నష్టపోయిన పశువుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వం తరఫున తగిన ఆర్థిక పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని

డిమాండ్ చేస్తూ కార్మికుల భారీ నిరసన ర్యాలీ



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలో కార్మికులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని టవర్ క్లాక్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, నినాదాలతో హోరెత్తుతూ ఆర్ట్స్ కళాశాల వరకు ఉత్సాహంగా సాగింది. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత 17 ఏళ్లుగా కార్మికుల కనీస వేతనాలను సవరించకపోవడం అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న ప్రస్తుత తరుణంలో, పాత వేతనాలతో కార్మికులు కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కకపోవడంతో కార్మిక వర్గం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని ఆయన వివరించారు. ?ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

అనంతపురం డిప్యూటీ మేయర్‌గా

తొండపునాటి స్వాతి ప్రమాణ స్వీకారం

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : అనంతపురం నగరపాలక సంస్థ నూతన డిప్యూటీ మేయర్‌గా 8వ డివిజన్ కార్పొరేటర్ తొండపునాటి స్వాతి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా స్వాతి బాధ్యతలు స్వీకరించి, నూతన పాలకవర్గ భాగస్వామ్యంలో నగర అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య పదవుల సర్దుబాటులో భాగంగా అనంతపురం డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా టీడీపీ నాయకత్వం ప్రమాణ స్వీకారం అనంతరం తొండపునాటి స్వాతి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలకమైన డిప్యూటీ మేయర్ బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 8వ డివిజన్ కార్పొరేటర్‌గా తనను ఆదరించిన ప్రజలకు, అలాగే ఈ ఎన్నిక ప్రక్రియలో సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నగరంలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ, నగరవాసులకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తొండపునాటి స్వాతి పేరును ఖరారు చేసింది. అనంతరం డిప్యూటీ మేయర్ పదవికి ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్పొరేషన్‌లో మేయర్ పదవి వేరే పార్టీకి దక్కినప్పటికీ, కూటమికి ఉన్న బలం నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకుంది.

చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్‌లుగా

బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : కళ్యాణదుర్గం మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టింది. ఎన్నికల అధికారి, ఆర్డీఓ వసంత బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్పర్సన్‌గా బుట్నా లక్ష్మి, వైస్ చైర్పర్సన్‌గా వెంకట కార్తీక్‌తో పాటు మొత్తం 24 మంది కౌన్సిలర్లు ప్రమాణం చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ మరియు కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం నూతన పాలకవర్గం సమన్వయంతో, అంకితభావంతో కృషి చేయాలని ఆయన సూచించారు. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు.

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో

ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు





అనంతపురం నవంబర్ 23 తెలుగుకలం : జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మరియు కార్మికులకు ఆయా పోలింగ్ రోజుల్లో వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ జి. లక్ష్మీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 1988 ప్రకారం నవంబర్ 26 (గురువారం), నవంబర్ 29 (ఆదివారం) మరియు డిసెంబర్ 2 (బుధవారం) తేదీలలో గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు సాధారణ ఎన్నికలు నిర్వహించనున్న ప్రాంతాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ కమిషనర్ శ్రీ గంధం చంద్రుడు, ఐ.ఏ.ఎస్ వారు జారీ చేసిన ఉత్తర్వుల (ప్రొసీడింగ్స్ నెం. 1/3507985/2026) మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని సంబంధిత దుకాణాలు, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న సిబ్బందికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఉద్యోగులు, కార్మికులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు యాజమాన్యాలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఉప కార్మిక కమిషనర్ సూచించారు.

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి సారించాం జిల్లా కలెక్టర్



అనంతపురం నవంబర్ 23 తెలుగుకలం : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) - 2026 పై ప్రత్యేక దృష్టి సారించి, అందిన అన్ని క్లెయిమ్స్‌ను సకాలంలో పరిష్కరించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. సోమవారం అమరావతి, వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్-2026 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఓ.ఆనంద్ జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వివరాలను సీఈఓకు వివరించారు. జిల్లాలో ఎస్ఐఆర్ కింద అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ లేదా డూప్లికేట్ జాబితాలో మొత్తం 2,48,087 పేర్లు ఉన్నాయని, వీటన్నింటికీ ఈ నెల 30వ తేదీ లోపు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఫారం 6, 7, 8 క్లెయిమ్స్‌కు సంబంధించి ఇప్పటివరకు ఫారం-6 కింద 4,296, ఫారం-7 కింద 35, మరియు ఫారం-8 కింద 1,154 దరఖాస్తులు అందాయని కలెక్టర్ వివరించారు. వచ్చిన క్లెయిమ్స్ అన్నింటినీ నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డీఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా అర్హుల జాబితాలను

ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపించాలి

జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్



అనంతపురం తెలుగుకలం నవంబర్ 23 : రబీ 2024-25 మరియు ఖరీఫ్ 2025 సీజన్లకు సంబంధించిన రైతుల పంటల బీమా అర్హుల, అనర్హుల జాబితాలను తక్షణమే ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపించాలని అనంతపురం జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కమిటీ సభ్యుల సిఫార్సుల నిమిత్తం పంటల బీమా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ 2024-25 మరియు ఖరీఫ్ 2025 సీజన్లకు సంబంధించి రైతుల పంటల బీమా వివరాలను ఈ-క్రాప్ డేటాతో క్షుణ్ణంగా సరిచూసి, ఇప్పటికే అర్హుల మరియు అనర్హుల జాబితాలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ తుది వివరాలను ఎటువంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి, ఎన్ఐసి డిఐఓ భారతి, సిపిఓ బాలాజీనాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మారుతి శ్రీనివాసులు, మరియు వివిధ ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం

పెనుకొండలో ఘనంగా 101వ జయంతి వేడుకలు



పెనుకొండ (తెలుగు కలం) (నవంబర్ 23) : నిస్వార్థ సేవే నిజమైన ఆధ్యాత్మికత అని చాటిచెప్పిన మహనీయులు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జయంతి వేడుకలు పెనుకొండలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక రాష్ట్ర మంత్రి సవితమ్మ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సవితమ్మ, ఇతర ప్రముఖ నాయకులు సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు సాయిబాబా బోధనలను, సేవా నిరతిని గుర్తుచేసుకున్నారు. "అందరినీ ప్రేమించు.. అందరికీ సేవ చేయు" అనే దివ్య సందేశంతో ఆయన కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. సామాన్యులకు అత్యవసరమైన విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో సత్యసాయిబాబా అందించిన సేవలు అజరామరమని, ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎన్నో లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. నేటి తరం ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మానవతా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకల్లో మంత్రి సవితమ్మతో పాటు అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ గంజే నాగరాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, శింగనమల నియోజకవర్గ టూ మెన్ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, క

రాయలసీమ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో

గుత్తి 'సాయి స్పోర్ట్స్ యూనిట్' క్రీడాకారుల సత్తా



గుత్తి / గార్లదిన్నె తెలుగుకలం ప్రతినిధి నవంబర్ 23 : అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యామ్ వద్ద ఉన్న నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం జరిగిన 'రాయలసీమ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2026' పోటీల్లో గుత్తికి చెందిన సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎనిమిది జిల్లాల నుండి సుమారు 600 మంది క్రీడాకారులు తలపడిన ఈ మెగా టోర్నీలో, అనంతపురం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకోవడంలో గుత్తి అకాడమీ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. ఈ పోటీల్లో సాయి స్పోర్ట్స్ యూనిట్ క్రీడాకారులు 10 స్వర్ణ, 11



రజత, 11 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 32 పతకాలను సాధించి రికార్డు సృష్టించారు. విభాగాల వారీగా విజేతల వివరాలను పరిశీలిస్తే, కిడ్స్ బాలుర విభాగంలో ఎ. అద్విక్, డి. తెనిరుధ్ నిఖిల్ రజత పతకాలు సాధించగా, పి. రుషాశాంక్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. కిడ్స్ బాలికల విభాగంలో పి. లిషిక, బి. వీక్షిత బంగారు పతకాలతో మెరవగా, ఎం. భాషిత రజతం, ఎం. అద్వైత మరియు పి. రోహిత కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. సబ్-జూనియర్ బాలుర విభాగంలో డి. మిథున్ కుమార్ స్వర్ణ పతకం సాధించగా, సి. శశాంక్, బి. నవనీత్, కె.కె. జగత్ సాయి, పి. వైష్ణవ్ రజత పతకాలను; జి. రిత్విక్ కుమార్, బి. ప్రణవ్ కాంత్, కె.ఎస్. హెత్విక్, ఎం. తనీష్ కాంస్య పతకాలను దక్కించుకున్నారు. సబ్-జూనియర్ బాలికల విభాగంలో గుత్తి క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఈ విభాగంలో బి. నేహాస్వి, పి. తోషిత, బి. హెశ్విత, డి. నిక్షిత, ఎం. వైశాలి ఐదుగురూ స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటగా, టి. లోక్య రజతం, యు. జశ్విత కాంస్య పతకం గెలుచుకున్నారు. క్యాడెట్ బాలుర విభాగంలో డి.ఎస్. సాయి కౌశిక్, ఎం. రెహాన్ కాంస్య పతకాలు సాధించగా, క్యాడెట్ బాలికల విభాగంలో జి. అస్మిత స్వర్ణం, పి. నిహారిక, టి. దివ్య సాయి రజతాలు, గాయత్రి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో ఎన్. భవాని బంగారు పతకం, సీనియర్ బాలుర విభాగంలో టి. అభిరామ రాజు రజత పతకం సాధించి అకాడమీ కీర్తిని ఇనుమడింపజేశారు. క్రీడాకారుల కఠోర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావం వల్లే ఈ ఘనవిజయం సాధ్యమైందని సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మరిన్ని పతకాలు సాధించి గుత్తి పట్టణానికి, అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను, నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అకాడమీ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు

అనంతపురం విద్యార్థిని జల నక్షత్ర ఎంపిక



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అనంతపురం జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని జల నక్షత్ర ప్రతిభావంతంగా ఎంపికై జిల్లా కీర్తిని ఇనుమడింపజేసింది. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో జల నక్షత్ర అద్భుత ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయంతో ఆమె ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీ వేదికగా డిసెంబర్ 15 నుంచి జరగనున్న 70వ జాతీయ క్రీడల్లో జల నక్షత్ర పాల్గొననుంది. రాష్ట్రస్థాయిలో కనబరిచిన పట్టుదల, క్రీడా నైపుణ్యంతో జాతీయ పోటీలకు ఎంపికైన ఆమె రానున్న పోటీల్లోనూ సత్తా చాటి రాష్ట్రానికి, జిల్లాకు పతకాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన సందర్భంగా జల నక్షత్రను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపింది. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, జల నక్షత్ర సాధించిన ఈ విజయం తోటి విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుందని యాజమాన్యం పేర్కొంది. బరేలీలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి మరిన్ని విజయాలు అందుకోవాలని అధ్యాపకులు, సిబ్బంది, తోటి విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతపురం జేఎన్టీయూ లో

'ఏఐ ఆధారిత మెకానికల్ ఇంజినీరింగ్' వర్క్‌షాప్ ప్రారంభం



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం రిజిస్ట్రార్ ఆచార్య దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "ఏఐ ఆధారిత మెకానికల్ ఇంజినీరింగ్" అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) కేవలం కంప్యూటర్ సైన్స్ విభాగానికే పరిమితం కాకుండా, నేడు మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, తద్వారా భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు. ?కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఆటోమేషన్, రోబోటిక్స్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక ప్రక్రియలలో ఏఐ పాత్ర కీలకంగా మారిందని వివరించారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులలో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధా మాట్లాడుతూ, ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు ఏఐ ఆధారిత డిజైన్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విభాగానికి చెందిన పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం, పరిశోధక విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ముగిసిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ - 2027 వేదికగా కోల్‌కతా

హైదరాబాద్ హైటెక్ సిటీ వేదికగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశం నేటితో ముగిసింది.నాలుగు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశాల్లో కీలక అంశాలపై చర్చలు జరిగాయి. తాజా సాంకేతికతలను ఉపయోగించి మరింత సురక్షితమైన, సుస్థిరమైన, మన్నికైన రహదారి మౌలిక సదుపాయాల నిర్మాణంపై దృష్టి సారిస్తూ 19 సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. రోడ్లు, వంతెనల నిర్మాణం, నిర్వహణ, ప్రమాదాల తగ్గింపుకు సంబంధించిన తాజా పరిష్కారాలను ప్రదర్శించే టెక్నాలజీని ఐఆర్‌సీలో ప్రదర్శించారు. తెలంగాణ వారసత్వం, సంస్కృతిని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలు ఐఆర్‌సీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరిరోజున ఐఆర్‌సీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది ఐఆర్‌సీ వార్షిక సమావేశాలను పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించాలని సంస్థ నిర్ణయించింది.హైదరాబాద్ హైటెక్ సిటీ వేదికగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశం నేటితో ముగిసింది. దేశ, విదేశాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని రహదారి మౌలిక సదుపాయాల భవిష్యత్తు, ఇంజినీరింగ్‌లో నూతన ఆవిష్కరణలు, రహదారి భద్రత, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఐఆర్‌సీలో 19 సాంకేతిక సమావేశాలు, రహదారి నిర్మాణ రంగంలోని తాజా ఉత్పత్తులు, సాంకేతికతలు, పరిష్కారాలను ప్రదర్శించారు. 400కు పైగా స్టాళ్లతో కూడిన సాంకేతిక ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, పరిచయం చేసే ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. నోరూరించే 90 రకాల వంటకాలను అతిథులకు వడ్డించారు.

19 సాంకేతిక సమావేశాలు

నాలుగు రోజుల వార్షిక సమావేశంలో రహదారి భద్రత, నిర్మాణ సామగ్రి, సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారి నిర్మాణంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వినియోగం వంటి విస్తృత అంశాలపై 19 సాంకేతిక సమావేశాలు జరిగాయి. రహదారి రంగానికి చెందిన నిపుణులు పరిశోధనా పత్రాలను సమర్పించడంతో పాటు, భారతదేశ రహదారి నెట్‌వర్క్ భద్రత, నాణ్యత, మన్నిక, సుస్థిరతను మెరుగుపరిచే లక్ష్యంతో తమ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలను పంచుకున్నారు.సమావేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు. ఐఆర్‌సీలో సాంకేతిక ప్రదర్శన ప్రత్యేక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అందులో ఆధునిక సాంకేతికతలు, వినూత్న నిర్మాణ పరిష్కారాలు, రహదారి అభివృద్ధి సామర్థ్యాన్ని, వేగాన్ని పెంచగల సుస్థిర పదార్థాలను ప్రదర్శించారు. దీంతోపాటు మరింత సురక్షితమైన, ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల, సుస్థిర రహదారి మౌలిక సదుపాయాల నిర్మాణానికి దోహదపడే అభివృద్ధి చెందుతున్న పరిష్కారాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

సాంస్కృతిక గుర్తింపు పరిచయం

తెలంగాణ వారసత్వం, సంప్రదాయాలను తెలియజేసేవిధంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తద్వారా దేశ నలుమూలల నుంచి వచ్చిన సందర్శకులకు రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన సాంస్కృతిక గుర్తింపును పరిచయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్టులు, కార్యక్రమాలను వివరించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర రహదారి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రయత్నాలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అధికారులు తెలిపారు.

అనంతపురం డిసిహెచ్ఎస్ కార్యాలయాన్ని 'బారు'గా

మార్చిన సీనియర్ అసిస్టెంట్.. వైద్య ఆరోగ్య శాఖలో కలకలం!





అనంతపురం / గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 23) : ప్రతినిధి : ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణకు, బాధ్యతకు మారుపేరుగా నిలవాల్సిన కొందరు ఉద్యోగులు నిబంధనలను తుంగలో తొక్కుతూ కార్యాలయాల పవిత్రతను మంటగలుపుతున్నారు. తాజాగా అనంతపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయాన్ని ఒక ఉద్యోగి ఏకంగా మద్యం సేవించే బారుగా మార్చేసిన ఘటన జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది.ప్రస్తుతం గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి. ఎర్రిస్వామి, అనంతపురం డిసిహెచ్ఎస్ కార్యాలయ ప్రాంగణంలోనే మద్యం సేవిస్తూ దొరికిపోవడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, ఆసుపత్రుల పర్యవేక్షణకు కేంద్ర బిందువుగా ఉండే అత్యున్నత స్థాయి కార్యాలయంలోనే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయ నియమావళిని ఉల్లంఘిస్తూ కార్యాలయ గదుల్లోనే మద్యం సిట్టింగ్‌లు వేయడం ఏంటని స్థానికులు, ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. గతంలోనూ సదరు ఉద్యోగి వ్యవహారశైలిపై, నియామకాల విషయంలో పలు ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తుండగా, తాజాగా ఏకంగా డీసీహెచ్ఎస్ కార్యాలయాన్నే బారుగా మార్చిన వ్యవహారం బయటకు రావడంతో ఉన్నతాధికారులు దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారదర్శకత, క్రమశిక్షణ ఉండాలని ప్రభుత్వం పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ, కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వైద్య శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మరియు డీసీహెచ్ఎస్ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన సీనియర్ అసిస్టెంట్ ఎర్రిస్వామిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు (సస్పెన్షన్) తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తిరుపతిలో మరో కొత్త నగరం.. అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో మెగా టౌన్‌షిప్

తిరుపతిలో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ ఏర్పాటుకు ఆమోదం

డిసెంబర్ 20 నుంచి 29 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు

సామాన్య భక్తులకు 92 శాతం దర్శన సమయం కేటాయింపు

రూ.7.5 కోట్లతో 500 నాటు ఆవుల కొనుగోలుకు నిర్ణయం

అలిపిరి నడక మార్గంలో కేబుల్ బ్రిడ్జిపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం



తిరుపతిలోని అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డులోని స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుంచి రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. తిరుపతికి వచ్చే భక్తులకు ఒకేచోట మెరుగైన వసతి, ఆధునిక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్), డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీని నియమించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రణాళికా దశలోనే ఉంది.

డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు

ఈ ఏడాది డిసెంబర్ 20 నుంచి 29 వరకు మొత్తం 10 రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. ఈ పది రోజుల్లో సుమారు 8.34 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 51 వేల మందికి అదనంగా దర్శన భాగ్యం కల్పించనుండటం విశేషం. మొత్తం దర్శన సమయంలో 92 శాతం సమయాన్ని సాధారణ భక్తులకే కేటాయించాలని నిర్ణయించారు.మొదటి రెండు రోజులైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో ఉచిత సర్వదర్శనం ఉండదు. కేవలం ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. మిగిలిన ఎనిమిది రోజులు సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుంది. అయితే ఈ ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో ఎప్పుడు విడుదల చేస్తారనే తేదీని టీటీడీ ఇంకా ప్రకటించలేదు.

టీటీడీ మరికొన్ని కీలక నిర్ణయాలు

గో సంరక్షణ: ఆలయంలో నిత్య కైంకర్యాలు, శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన స్వచ్ఛమైన పాలు, నెయ్యిని స్థానికంగానే ఉత్పత్తి చేసేందుకు రూ.7.5 కోట్ల వ్యయంతో 500 దేశీయ ఆవులను కొనుగోలు చేయనున్నారు.పర్యావరణం, పారిశుద్ధ్యం: తిరుమల క్షేత్రాన్ని నెట్-జీరోగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా పర్యావరణ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం అదనంగా 348 మంది సిబ్బందిని నియమించనున్నారు.అటవీ పరిరక్షణ: శేషాచలం అటవీ ప్రాంత సంరక్షణ కోసం అటవీశాఖకు రెండేళ్ల కాలానికి రూ.16.4 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం తెలిపారు.విద్య, వైద్య రంగాలు: స్విమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి అదనంగా రూ.41.23 కోట్లు మంజూరు చేశారు. ఆయుర్వేద కళాశాలలో

బంగాళాఖాతంలో మరో రెండు తుపాన్లు

ఏపీతో పాటు ఒడిశా, తమిళనాడుకు ముప్పు

ఇటీవలి రెండు తుపాన్లు రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని మిగి ల్చాయి. అక్టోబరు నెలాఖరులో అర్నబ్, నవంబరు 1న మురసు పెను ప్రభావం చూపాయి. బంగాళాఖాతంలో మరో రెండు తుపాన్లు ఇప్పటికే రెండు తుపాన్లు రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని మిగల్చగా మరో రెండు తుపాన్ల ముప్పు పొంచి ఉందని వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఈ నెలాఖరుకు బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డిసెంబరు మొదటి వారం తర్వాత మరో తుపాను ఏర్పడవచ్చని చెబుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇంకొకటి(మూడో తుపాను) ఏర్పడినా ఆశ్చర్యపోనవసరం లేదని ఏయూ వాతావరణ విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు తెలిపారు.ఉష్ణోగ్రతలు పెరిగితే దక్షిణ బంగాళాఖాతంలో ఉష్ణోగ్రతలు పెరిగితే అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడతాయని చెప్పారు. సముద్రంపై ఆవరించిన రుతుపవనాలు తేమను గ్రహించటంతో అల్పపీడనాలకు అవకాశముందన్నారు. ఇవి తుపాన్లుగా మారి ఏ దిశగా పయనిస్తాయనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. ఏపీతో పాటు ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు ముప్పు తప్పదని పేర్కొన్నారు. తాజాగా మరో తుపాను ఏర్పడే అవకాశాలున్నాయన్న అంచనాలతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.వర్షాలతో వణికించిన మురసు సూపర్ ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రంలో జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాలు అంతంతమాత్రమే కురిశాయి. ఖరీఫ్ సీజన్‌ను కరవు కమ్మేసింది. వర్షాభావంతో పంటల సాగు తగ్గిపోగా, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికీ ఎద్దడి తప్పకపోవచ్చన్న సంకేతాలు వచ్చాయి. అక్టోబరు 26-29 మధ్య అర్నబ్ తుపాన్ బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు కుండపోత వర్షాలతో ముంచేసింది. యానాం సమీపంలో తీరం దాటిన ఈ తీవ్ర తుపానుతో వివిధ రంగాలకు సుమారు రూ.4,563 కోట్ల మేర నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. 16 జిల్లాల్లో 3.56 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిని, రూ.1,260 కోట్ల మేర పంటనష్టం వాటిల్లింది. ఇక, నవంబరు 3-7 వరకు అతిభారీ వర్షాలతో వణికించిన మురసు తుపాను 17 జిల్లాల్లో పెనుప్రభావం చూపింది.

చేవెళ్లలో దొంగతనం ఫిర్యాదు చేసిన మహిళ హత్య: 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

ఫోన్ దొంగతనంపై ఫిర్యాదు చేశారనే కోపంతో దారుణం

నిందితుడు 19 ఏళ్ల కేశావత్ శివశంకర్ అరెస్ట్

అతడి నుంచి సెల్‌ఫోన్, హత్యకు వాడిన కత్తి స్వాధీనం

నిందితుడిపై గతంలో ఏపీలోనూ దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తింపు

తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కక్షతో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన 19 ఏళ్ల యువకుడిని చేవెళ్ల పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ దొంగతనంతో పాటు బ్యాంక్ ఖాతా నుంచి నగదు బదిలీ చేసిన వ్యవహారం ఈ హత్యకు దారితీసింది. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కేశావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ (19), బాతుల గురువులు అనే వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించాడు. అనంతరం బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 45,000 నగదును తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన గురువులు, పద్మ అనే మహిళతో కలిసి ఈ నెల 21న చేవెళ్ల పోలీసులకు శివపై ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసే సమయంలో పద్మ కూడా ఉండటంతో శివ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు వద్ద పద్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సాయంతో కేవలం 24 గంటల్లోనే నిందితుడు శివను పట్టుకున్నారు. నిందితుడిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో రెండు దొంగతనం కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

చలికాలంలో "గొంతు నొప్పి" ఇబ్బందిపెడుతోందా...ఈ ఆయుర్వేద ఔషధంతో తగ్గించుకోవచ్చు

వాతావరణ మార్పుల కారణంగా చలికాలంలో గొంతు నొప్పి సమస్య ఆయుర్వేద ప్రకారం ఈ ఔషధంతో నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చట రోజురోజుకీ చలి ప్రభావం పెరుగుతోంది. ఇక చలికాలం అనగానే చాలా మందికి జలుబు కామన్. వారం రోజుల పాటు ఈ సమస్య ఉంటుంది. జలుబుకు తోడు గొంతు నొప్పి కూడా మొదలవుతుంది. గొంతులో గరగరగా ఉండి ఒకటే అసౌకర్యంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో తినడం, తాగడం కూడా కష్టమే. మరి, మీరు కూడా చలికాలంలో గొంతు నొప్పితో బాధపడుతున్నారా అయితే ఆయుర్వేదం ప్రకారం ఓ ఔషధాన్ని తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి ఉపశమనం పొందొచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.చలికాలంలో గొంతు నొప్పికి కారణం: చలికాలంలో వాతావరణంలో వివిధ రకాల మార్పులు జరుగుతాయని.. ఈ మార్పుల కారణంగా హానికారక బ్యాక్టీరియా, వైరస్‌లు గొంతులో తిష్ట వేసుకుంటాయని, ఫలితంగా గొంతంతా అసౌకర్యంగా అనిపిస్తుందని ఆయుర్వేదిక్ కన్సల్టెంట్ డాక్టర్ గాయత్రీ దేవీ చెబుతున్నారు. దీని మూలంగా తినడం, తాగడం కష్టమవుతుందంటున్నారు. ఇక కొన్ని సార్లు నొప్పికి తోడు జ్వరం, నీరసం, ఆకలి లేకపోవడం, దగ్గు, గొంతు బొంగురు పోవడం, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు. అయితే గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభించేందుకు ఈ ఔషధం మంచిగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అది ఎలా చేసుకోవాలంటే,

కావాల్సిన పదార్థాలు

లవంగాల చూర్ణం – 10 గ్రాములు తానికాయ పొడి – 10



గ్రాములు మిరియాల పొడి – 10 గ్రాములు కాచు – 30 గ్రాములు తుమ్మ బెరడు చూర్ణం – 30 గ్రాములు నీళ్లు – పావు లీటర్

తయారీ విధానం

ఈ ఔషధం తయారీకి ముందుగా పైన చెప్పిన పదార్థాలను విడివిడిగా మెత్తని పొడిలా గ్రైండ్ చేసి పక్కన ఉంచాలి.ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి పావు లీటర్ నీళ్లు పోయాలి. వాటర్‌లోకి తుమ్మబెరడు చూర్ణం వేసి బాగా కలిపి సిమ్‌లో పెట్టి నీళ్లు సగానికి అయ్యేవరకు కలుపుతూ మరిగించుకోవాలి.ఈలోపు ఇంకో గిన్నెలోకి కాచు పొడి, లవంగాల పొడి, మిరియాల పొడి, తానికాయ చూర్ణం వేసి మిక్స్ చేసుకోవాలి.నీళ్లు మరిగి సగానికి ఇంకినప్పుడు ఈ పొడులన్నీ వేసి దగ్గరకు వచ్చే వరకు ఉడికించుకోవాలి. మిశ్రమం చక్కగా ఉడికి పాన్‌కు అంటుకోకుండా సెపరేట్ అయినప్పుడు తీసి వేరే గిన్నెలోకి వేసుకుని చల్లార్చుకోవాలి.మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడు కొద్దికొద్దిగా తీసుకుంటూ కుంకుడు గింజ పరిమాణంలో రౌండ్‌గా చేసుకోవాలి. ఇలా మిశ్రమం మొత్తాన్ని అలానే చేసుకోవాలి. ఆ తర్వాత వాటిని తడిలేని, గాలి చొరబడని డబ్బాలో స్టోర్ చేసుకుంటే గొంతు నొప్పికి ఔషధం రెడీ.ఎలా తీసుకోవాలంటే: గొంతు నొప్పి సమస్య తీవ్రంగా ఉన్నవారు ఈ మాత్రలను మూడు పూటలా అంటే ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఇంకోటి, రాత్రి మరోటి తీసుకుని నోట్లో వేసుకుని చప్పరించాలి. ఇలా గొంతు నొప్పి సమస్య తగ్గేవరకు తీసుకుంటూ ఉండాలని ప్రముఖ ఆయుర్వేదిక్ కన్సల్టెంట్ డాక్టర్ గాయత్రీ దేవీ చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

కాచు: ఇది గొంతు నొప్పిని తగ్గించడానికి చాలా బాగా ఉపయోగపడుతుందంటున్నారు డాక్టర్ గాయత్రీ దేవీ. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు గొంతులోని బ్యాక్టీరియాను నాశనం చేయడంలో సహాయపడతాయని, అలాగే గొంతు నొప్పికి కారణమయ్యే ఇన్ఫెక్షన్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఇక కాచు గొంతులోని అదనపు శ్లేష్మాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని వివరిస్తున్నారు.మిరియాలు: ఇందులోని పైపెరిన్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుందని.. ఇది గొంతులోని వాపు, మంటను తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.

లవంగాలు

లవంగాల్లోని యూజినాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ సెప్టిక్ లక్షణాలను కలిగి ఉంటుందని.. ఇది గొంతులోని బ్యాక్టీరియాను చంపి, ఇన్ఫెక్షన్‌ను తగ్గిస్తుందని చెబుతున్నారు. అలాగే గొంతులోని వాపు, మంటను తగ్గించడంలో కూడా ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని వివరిస్తున్నారు.

డ్యాన్స్ చేస్తే "ఒత్తిడి" తగ్గుతుందట మరి ఎంతసేపు చేయాలో తెలుసా

ప్రస్తుత రోజుల్లో ఒత్తిడితో చిత్తవుతున్న పిల్లలు, పెద్దలు

దీన్ని నుంచి ఉపశమనం పొందేందుకు రకరకాల ప్రయత్నాలు

అయితే డ్యాన్స్ మేలు చేస్తుందని సూచన



"ఒత్తిడి".. ఈ రోజుల్లో మెజార్టీ పీపుల్ ఎదుర్కొంటోన్న మానసిక సమస్యల్లో ఇదీ ఒకటి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సమస్యతో చిత్తవుతున్నారు. ఇక ఇది దీర్ఘకాలం కొనసాగితే వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఇబ్బందిపెడతాయి. అందుకే దీని నుంచి విముక్తి పొందేందుకు యోగా, ధ్యానం, జిమ్‌లో కసరత్తులు వంటివి చేస్తుంటారు. అయితే కేవలం ఇవి మాత్రమే కాకుండా మానసిక ఒత్తిళ్లు, ఆందోళనల్ని దూరం చేసుకోవడానికి డ్యాన్స్ కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు నిపుణులు. అది ఎలానో ఈ స్టోరీలో చూద్దాం.

డ్యాన్స్‌తో ఒత్తిడి ఎలా తగ్గుతుంది

ఏ రకం డ్యాన్స్ చేయాలన్నా మ్యూజిక్ కంపల్సరీ. ఎందుకంటే సంగీతాన్ని బట్టే మూమెంట్స్ మారుతుంటాయి. అయితే ఈ మ్యూజిక్ శరీరంలో కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్లు) స్థాయుల్ని తగ్గిస్తుందని, ఫలితంగా ఆందోళన తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.పాట వింటే చాలు ఎక్కడేలని హుషారు వచ్చేస్తుంది చాలా మందికి. ఈ క్రమంలో తెలియకుండానే పాటకు తగ్గట్టుగా కాళ్లు కదుపుతుంటారు. ఇక మాస్ బీట్ అయితే శరీరంలోని అన్ని అవయవాలకూ ఊపొస్తుంది. ఇలా డ్యాన్స్ చేయడానికి హ్యాపీ హార్మోన్లైన డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదలవడమే కారణమంటున్నారు నిపుణులు. ఇలా డ్యాన్స్ చేస్తుంటే మనసు కుదుటపడుతుందని.. దీన్నే అలవాటుగా మార్చుకుంటే క్రమంగా ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత సొంతమవుతుందని వివరిస్తున్నారు.ఏదైనా నచ్చిన పని చేస్తున్నప్పుడు దానిపైనే పూర్తి ఏకాగ్రత పెడతాం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా పని పూర్తి చేయకుండా కదలం. ఇలా నచ్చిన పని చేయడం వల్ల కాసేపు అయినా బాధలన్నీ మర్చిపోతాం. అయితే డ్యాన్స్ కూడా మానసిక సమస్యల్ని దూరం చేసి ప్రశాంతతను అందిస్తుందని వివరిస్తున్నారు నిపుణులు.ఒంటరిగా డ్యాన్స్ చేయడం ఇష్టం లేని వారు ఇంట్లో పార్ట్‌నర్‌తో కలిసి నృత్యం చేయచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేసే క్రమంలో ఒకరి శరీరాన్ని మరొకరు తాకడం వల్ల ఆక్సిటోసిన్ అనే లవ్ హార్మోన్ విడుదలవుతుందని.. ఇది మనసుకు సాంత్వన చేకూర్చుతుందని వివరిస్తున్నారు.జిమ్‌కు వెళ్తే రోజూ ఒకటే రకమైన వ్యాయామాలు చేయాలి. ఇలా చేయాలంటే ఎవరికైనా బోర్ కొడుతుంది. అదే డ్యాన్స్‌లో ఈ సమస్య ఉండదంటున్నారు. ఎందుకంటే పాటకు తగినట్లుగా విభిన్న భంగిమలు ప్రయత్నించచ్చని.. ఇది పరోక్షంగా ఒత్తిడినీ దూరం చేస్తుందని వివరిస్తున్నారు.డ్యాన్స్ క్లాసుల్లో చేరడం వల్ల మన చుట్టూ ఉన్న వారితో అనుబంధాన్ని పెంచుకోవచ్చని నిపుణులు. క్రమక్రమంగా ఇది ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఓ మార్గమే అంటున్నారు నిపుణులు.కొంతమంది తమకు ఎదురయ్యే సమస్యలను ఎదుటివారితో చెప్పుకోవడానికి వెనకాడుతుంటారు. ఫలితంగా ఒత్తిడి, ఆందోళనలను గురై మానసికంగా మరింత ఇబ్బంది పడుతుంటారని.. అదే భావోద్వేగాల్ని డ్యాన్స్ రూపంలో వ్యక్తపరిస్తే మనసు కాస్త కుదుటపడుతుందని చెబుతున్నారు.మానసిక సమస్యల కారణంగా ఆయా శరీరక కండరాలపై ఒత్తిడి పడుతుందని.. అదే డ్యాన్స్ వల్ల ఈ కండరాలు కాస్త రిలాక్సవుతాయని చెబుతున్నారు. అలాగే శరీరంలో శక్తి స్థాయిలూ పెరుగుతాయని వివరిస్తున్నారు. పరోక్షంగా ఇది మానసిక ప్రశాంతతను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు.డ్యాన్స్ శరీరంలో సెరటోనిన్ స్థాయుల్ని పెంచుతుందని, ఫలితంగా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత సొంతమవుతుందనే విషయాన్ని పలు పరిశోధనలూ రుజువు చేసినట్లు నిపుణులు చెబుతున్నారు.

బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్.. ఏది ఏ సమయంలో తినాలి నిపుణులు చెబుతున్నదేమిటి

ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య అల్పాహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు

మధ్యాహ్నం 12 గంటల తర్వాత టిఫిన్ చేస్తే గుండె జబ్బుల ముప్పు అధికం

రాత్రి 8 గంటల లోపు డిన్నర్ పూర్తి చేయడం అత్యంత ఉత్తమం

అర్ధరాత్రి దాటిన తర్వాత భోజనం చేయడం వల్ల పెరుగుతున్న అనారోగ్య సమస్యలు

ఇది కేవలం పరిశీలనాత్మక అధ్యయనం మాత్రమేనని స్పష్టం చేసిన నిపుణులు

రోజువారీ జీవితంలో అల్పాహారం (టిఫిన్) ఏ సమయంలో తీసుకోవాలనే అంశంపై తరచూ చర్చలు జరుగుతుంటాయి. సరైన సమయానికి ఆహారం తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతుంటారు. తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలోనూ ఇదే విషయం స్పష్టమైంది. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య అల్పాహారం తీసుకునే వారిలో అనారోగ్య ముప్పు గణనీయంగా తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.ఎన్డీటీవీ కథనం ప్రకారం... అమెరికాలో 40 ఏళ్లు పైబడిన 31,044 మంది వయోజనుల ఆహారపు అలవాట్లను నిపుణులు విశ్లేషించారు. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య అల్పాహారం తీసుకునేవారితో పోలిస్తే, సమయం గడిచేకొద్దీ అనారోగ్య సమస్యల తీవ్రత పెరుగుతున్నట్లు తేలింది. 8 నుంచి 10 గంటల మధ్య తినేవారిలో ముప్పు 10 శాతం ఎక్కువగా ఉండగా, 10 నుంచి 12 గంటల మధ్య తినేవారిలో 19 శాతం ముప్పు ఉన్నట్లు వెల్లడైంది. ఇక మధ్యాహ్నం 12 గంటల తర్వాత మొదటిసారి ఆహారం తీసుకునే వారిలో మరణ ముప్పు ఏకంగా 29 శాతం పెరుగుతున్నట్లు అధ్యయనం పేర్కొంది. అంతేకాకుండా, మధ్యాహ్నం 12 గంటల దాటిన తర్వాత మొదటి భోజనం చేసేవారిలో గుండె సంబంధిత సమస్యల ముప్పు 46 శాతం అధికంగా నమోదైనట్లు తేలింది.అల్పాహారంతో పాటు రాత్రి భోజనం (డిన్నర్) వేళలపై కూడా ఈ అధ్యయనం దృష్టి సారించింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో డిన్నర్ ముగించడం అత్యంత అనుకూలమైనదని, అర్ధరాత్రి దాటిన తర్వాత భోజనం చేసే వారిలో మరణ ముప్పు 27 శాతం ఎక్కువగా ఉంటోందని పరిశోధకులు వెల్లడించారు.అయితే, ఆలస్యంగా టిఫిన్ చేయడం వల్లే నేరుగా అనారోగ్యం సంభవిస్తుందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేశారు. ఈ అధ్యయనం కేవలం పరిశీలనాత్మకమైనది మాత్రమేనని, కారణాలను నిరూపించేది కాదని తెలిపారు. నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడి, అస్తవ్యస్తమైన పని వేళలు, క్రమరహిత జీవనశైలి వంటి ఇతర అంశాలు కూడా ఈ ముప్పునకు కారణం కావొచ్చని పేర్కొన్నారు.సాధారణంగా ఉదయం 6:00 నుంచి 6:30 గంటల మధ్య నిద్రలేవడం, 7:00 నుంచి 8:00 గంటల మధ్య అల్పాహారం, మధ్యాహ్నం 12:30 నుంచి 1:30 గంటల మధ్య లంచ్, సాయంత్రం 4:30 నుంచి 5:00 గంటల మధ్య తేలికపాటి స్నాక్స్, రాత్రి 7:00 నుంచి 8:00 గంటల మధ్య డిన్నర్ పూర్తి చేయడం మంచి అలవాటని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడప్పుడు ఏదైనా కారణం వల్ల ఉదయం 9 లేదా 10 గంటలకు టిఫిన్ చేసినంత మాత్రాన భయపడాల్సిన పనిలేదని, అయితే క్రమం తప్పకుండా భోజన వేళలు పాటిస్తూ, పౌష్టికాహారం, తగినంత వ్యాయామం, నిద్ర ఉండేలా చూసుకోవడం అత్యంత కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు.



ఫేస్ క్రీమ్ వాడితే కిడ్నీలు పాడైపోయాయి.. అసలు ఏం జరిగిందంటే

ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడి కిడ్నీ సమస్య బారిన పడ్డ కేరళ బాలిక

ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రచారాన్ని నమ్మి వాట్సాప్‌లో క్రీమ్ కొనుగోలు

క్రీమ్‌లో మెర్క్యూరీ స్థాయి ఏకంగా 12,500 పీపీఎం

బాలికకు 'మెంబ్రానస్ నెఫ్రోపతి' అనే కిడ్నీ వ్యాధి

మెర్క్యూరీ చర్మం ద్వారా శరీరంలోకి చేరి అంతర్గత అవయవాలను దెబ్బతీసిన వైనం

అందంగా కనిపించాలన్న కోరిక ఎవరికి ఉండదు ముఖంపై ఒక్క మొటిమ వస్తేనే ఆందోళన చెందే ఈ రోజుల్లో, కొన్ని రోజుల్లోనే తెల్లబడతారంటూ వచ్చే ప్రకటనలు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రచారాలను గుడ్డిగా నమ్మి చాలామంది మోసపోతున్నారు. తళతళలాడే చర్మం కోసం వాడే కొన్ని ఫెయిర్‌నెస్ క్రీములు ప్రాణాల మీదకే తెస్తున్నాయన్న చేదు నిజాన్ని కేరళలో చోటుచేసుకున్న తాజా సంఘటన కళ్లకు కట్టింది. తెల్లదనం మాట దేవుడెరుగు.. విషపూరితమైన కెమికల్స్ ఏకంగా మూత్రపిండాలనే దెబ్బతీస్తున్న వైనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

సోషల్ మీడియా మోజులో కేరళ బాలిక

కేరళలోని మలప్పురానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన వీడియోలను చూసి ఆకర్షితురాలైంది. అందులో ఇచ్చిన వాట్సాప్ నంబర్ ద్వారా చర్మం తెల్లబడే ఒక



క్రీమును ఆర్డర్ చేసింది. ముఖంపై మచ్చలు, మొటిమలు తగ్గడంతో దాదాపు ఏడాది పాటు దాన్ని వాడింది. కొన్ని రోజులకు కాళ్లలో వాపు రావడం, ఉన్నట్టుండి రక్తపోటు పడిపోవడం, తరచూ స్పృహ తప్పి పడిపోవడం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయగా, ఆమె తీవ్రమైన కిడ్నీ సంబంధిత సమస్య 'మెంబ్రానస్ నెఫ్రోపతి' బారిన పడినట్లు డాక్టర్లు గుర్తించారు.

క్రీముల్లో విషం.. ప్రమాదకర స్థాయిలో మెర్క్యూరీ

ఆ బాలిక రక్త నమూనాలను, ఆమె వాడిన క్రీమును ల్యాబ్‌లో పరిశీలించినప్పుడు మైండ్ బ్లాంక్ అయ్యే వాస్తవాలు వెలుగుచూశాయి. సాధారణంగా సౌందర్య ఉత్పత్తుల్లో మెర్క్యూరీ (పాదరసం) స్థాయి ఒక పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) కంటే తక్కువ ఉండాలి. కానీ ఆ అమ్మాయి వాడిన క్రీములో ఏకంగా 12,500 పీపీఎం మెర్క్యూరీ ఉన్నట్లు తేలింది. అనుమతించిన పరిమితి కంటే ఇది వేల రెట్లు ఎక్కువ. దీంతో ఆమె శరీరంలోకి అధిక మోతాదులో పాదరసం చేరి కిడ్నీలను దెబ్బతీసింది. ఈ ఘటనపై స్పందించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసు నమోదు చేసి విచారణకు ఆదేశించింది.

చర్మం తెల్లబడటం వెనుక దాగున్న చేదు నిజం

చర్మ రంగుకు కారణమయ్యే 'మెలనిన్' ఉత్పత్తిని అడ్డుకునేందుకు కొన్ని అక్రమ సంస్థలు క్రీముల్లో మెర్క్యూరీని కలుపుతుంటాయి. మొదట్లో ఇది చర్మాన్ని తెల్లగా మార్చినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతుంది. చర్మం ద్వారా మెర్క్యూరీ నెమ్మదిగా శరీరంలోకి చేరి అంతర్గత అవయవాలను విషతుల్యం చేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే కిడ్నీలలో పేరుకుపోయి ఫిల్టరింగ్ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుంది.

శరీరంలో కనిపించే ప్రమాదకర హెచ్చరికలు

మెర్క్యూరీ వల్ల కిడ్నీల ఫిల్టరింగ్ దెబ్బతిన్నప్పుడు మూత్రం నుంచి ప్రొటీన్లు బయటకు వెళ్లిపోతాయి. దీనిని ప్రొటీనూరియా అంటారు. దీనివల్ల కాళ్లు, చీలమండల్లో తీవ్రమైన వాపులు వస్తాయి. రక్తపోటులో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటాయి. చర్మంపై దద్దుర్లు, ఎరుపుదనం, అలర్జీలు వస్తాయి. శరీరంలోకి చేరిన మెర్క్యూరీ నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి చేతులు వణకడం, ఏకాగ్రత లోపించడం, కండరాల బలహీనత వంటి నాడీ సమస్యలకు దారితీస్తుంది. అలాగే రోగనిరోధక వ్యవస్థను సైతం దెబ్బతీస్తుంది.

త్వరగా మార్పు వస్తుందంటే నమ్మొద్దు

రాత్రికి రాత్రే లేదా కొన్ని రోజుల్లోనే రంగు మారుస్తామని ప్రచారం చేసే ఉత్పత్తుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక వ్యాపారుల లింకులు, ప్రచారాలను నమ్మి కొనుగోళ్లు చేయవద్దు. చర్మ సమస్యలు ఎదురైనప్పుడు స్వయంగా నిర్ణయాలు తీసుకోకుండా అర్హులైన డెర్మటాలజిస్టులను సంప్రదించి చికిత్స తీసుకోవడమే సురక్షితమైన మార్గం.

పట్టణ జీవనంతో పేగులకు చేటు.. పెరుగుతున్న ఊబకాయం, షుగర్!

పట్టణాలకు వలసలతో మారుతున్న పేగుల్లోని సూక్ష్మజీవులు

సంప్రదాయ ఆహారం స్థానంలో ప్రాసెస్డ్ ఫుడ్ తినడమే కారణం

ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు పెరిగే ప్రమాదం

గ్రామీణుల్లో మేలు చేసే బ్యాక్టీరియా, పట్టణ వాసుల్లో హానికర బ్యాక్టీరియా గుర్తింపు

భారత్, శ్రీలంక ప్రజలపై అమెరికా, భారత శాస్త్రవేత్తల సంయుక్త అధ్యయనం



పల్లెల నుంచి పట్టణాలకు వలసలు వెళ్లడం, ఆధునిక జీవనశైలికి అలవాటుపడటం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మన జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల (గట్ మైక్రోబయోమ్) సమతుల్యత దెబ్బతిని ఊబకాయం, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు పెరుగుతోందని తాజా అధ్యయనం హెచ్చరించింది. అమెరికా, భారత్, శ్రీలంక పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'గట్ మైక్రోబీస్'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.'డిస్టింక్ట్ ట్రాజెక్టరీస్ ఆఫ్ అర్బనైజేషన్ షేప్ ద హ్యూమన్ గట్ మైక్రోబయోమ్ అక్రాస్ సౌత్ ఏషియా' పేరుతో సాగిన ఈ అధ్యయనంలో భాగంగా భారత్, శ్రీలంకలోని 10 భిన్న సముదాయాలకు చెందిన 575 మంది ఆరోగ్య పరిస్థితిని విశ్లేషించారు. ఇందులో సంప్రదాయ జీవనశైలి గడిపే గ్రామీణులు, ఏడాదికి పైగా పట్టణాల్లో నివసిస్తున్నవారు ఉన్నారు. వారి నుంచి మల నమూనాలను సేకరించి, పేగుల్లోని బ్యాక్టీరియా రకాలను పరిశీలించారు.గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారం తీసుకునే వారిలో 'హోల్డెమానెల్లా' వంటి మేలు చేసే బ్యాక్టీరియా అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఇది పీచు పదార్థాల జీర్ణానికి, రక్తంలో గ్లూకోజ్ స్థాయిల నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే, పట్టణీకరణ పెరిగే కొద్దీ ఈ బ్యాక్టీరియా తగ్గిపోయి, దాని స్థానంలో 'మెగామోనాస్' అనే హానికర బ్యాక్టీరియా పెరుగుతున్నట్లు తేలింది. ఈ మెగామోనాస్ అధికంగా ఉన్నవారిలో ఊబకాయం, అధిక రక్త గ్లూకోజ్, డయాబెటిస్ వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు.సంప్రదాయబద్ధంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు, దుంపలు తినే అలవాటుకు బదులుగా, పట్టణాల్లో ప్యాకెట్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, అధిక కొవ్వు, చక్కెర ఉండే తినుబండారాలు తినడం వల్లే ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధనలో మధ్య భారతదేశానికి చెందిన గోండు, కొలామ్, కోయ వంటి ఆదివాసీ తెగలను చేర్చడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్, భద్రాద్రి వంటి ప్రాంతాలపై పట్టణీకరణ ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవడానికి ఈ నివేదిక కీలకంగా మారింది. మొత్తం మీద, మారుతున్న జీవనశైలి మన పేగుల్లోని ఆరోగ్యకర వాతావరణాన్ని దెబ్బతీస్తూ జీవనశైలి వ్యాధులకు ప్రధాన కారణంగా నిలుస్తోందని ఈ నివేదిక తేల్చిచెప్పింది.

ఫిట్‌నెస్ మోజులో యువత.. సంతాన సామర్థ్యంపై స్టెరాయిడ్ల దెబ్బ!

ఆరోగ్యం కోసం చేసే మితమైన వ్యాయామంతో పురుషులకు మేలు

అతిగా వర్కౌట్లు చేయడం, కల్తీ సప్లిమెంట్లు వాడటం సంతానలేమికి దారితీసే అవకాశం

అనబాలిక్ స్టెరాయిడ్లు, టెస్టోస్టెరాన్ వాడకం వీర్య కణాల ఉత్పత్తిని దెబ్బతీస్తుందంటున్న నిపుణులు

శరీరంలో సహజ హార్మోన్ల ఉత్పత్తిని స్టెరాయిడ్లు అణిచివేస్తాయని హెచ్చరిక

సప్లిమెంట్ల కంటే జింక్, సెలీనియం, విటమిన్ డి ఉన్న సమతులాహారం ఎంతో ముఖ్యం

ప్రస్తుత తరంలో ఫిట్‌నెస్‌పై యువతలో ఆసక్తి విపరీతంగా పెరిగింది. కండలు తిరిగిన శరీరం కోసం జిమ్‌లలో గంటల తరబడి శ్రమిస్తున్నారు. అయితే, ఈ ఫిట్‌నెస్ ప్రయాణంలో అనుసరిస్తున్న కొన్ని పద్ధతులు వారి సంతాన సామర్థ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా త్వరగా ఫలితాలు సాధించాలనే ఆత్రుతతో వాడే అనబాలిక్ స్టెరాయిడ్లు, కల్తీ ప్రోటీన్ సప్లిమెంట్లు, టెస్టోస్టెరాన్ ఇంజెక్షన్లు పురుషుల్లో సంతానలేమికి దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఈ అంశంపై ఒక కథనంలో నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. మితమైన శారీరక శ్రమ పురుషుల ప్రత్యుత్పత్తి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది గుండె పనితీరును మెరుగుపరచడం, శరీర బరువును నియంత్రణలో ఉంచడం, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడం ద్వారా సంతానోత్పత్తికి దోహదపడుతుందని తెలిపారు. ఊబకాయం, జీవక్రియ సమస్యల వల్ల వచ్చే సంతానలేమిని మితమైన వ్యాయామం తగ్గిస్తుందని పరిశోధనలు కూడా చెబుతున్నాయి. అయితే, సమస్యంతా అతిగా శ్రమించడం, ప్రమాదకరమైన సప్లిమెంట్ల వాడకం వల్లే వస్తోందని నిపుణులు స్పష్టం చేశారు.

ప్రధాన ముప్పు స్టెరాయిడ్లతోనే

జిమ్‌కు వెళ్లే చాలామంది ప్రోటీన్ పౌడర్లను వాడుతుంటారు. నాణ్యమైన, కల్తీ లేని ప్రోటీన్ సప్లిమెంట్లను సరైన మోతాదులో తీసుకుంటే వీర్య కణాల సంఖ్యపై ప్రత్యక్షంగా ఎలాంటి ప్రభావం ఉండదు. కానీ, మార్కెట్లో లభించే కొన్ని సప్లిమెంట్లలో అనబాలిక్ స్టెరాయిడ్లు లేదా హార్మోన్లను రహస్యంగా కలుపుతున్నారు. వీటి వాడకమే అసలు సమస్యకు కారణం. అనబాలిక్ స్టెరాయిడ్లు, బయటి నుంచి తీసుకునే టెస్టోస్టెరాన్ థెరపీ శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే 'ల్యూటినైజింగ్ హార్మోన్' , 'ఫోలికల్-స్టిమ్యులేటింగ్ హార్మోన్' ఉత్పత్తిని పూర్తిగా అణిచివేస్తాయి. ఈ రెండు హార్మోన్ల వీర్య కణాల ఉత్పత్తికి అత్యంత కీలకం.ఈ హార్మోన్ల ఉత్పత్తి ఆగిపోవడం వల్ల పురుషుల్లో వీర్య కణాల సంఖ్య గణనీయంగా తగ్గడం (ఒలిగోస్పెర్మియా), కొన్నిసార్లు పూర్తిగా సున్నాకి పడిపోవడం (అజూస్పెర్మియా), వృషణాల పరిమాణం కుచించుకుపోవడం, సహజ టెస్టోస్టెరాన్ ఉత్పత్తి ఆగిపోవడం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. ఈ కారణంగానే, పిల్లల్ని కనాలనుకునే పురుషులు టెస్టోస్టెరాన్ థెరపీకి దూరంగా ఉండాలని వైద్య నిపుణులు స్పష్టంగా సూచిస్తున్నారు.



సమతులాహారమే ఉత్తమం

అతిగా వ్యాయామం చేస్తూ, కేలరీలు చాలా తక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం కూడా శరీరంలో శక్తి లోపానికి దారితీసి టెస్టోస్టెరాన్ స్థాయిలు, లైంగిక వాంఛ, వీర్య కణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. నిరంతర అలసట, గాయాల నుంచి కోలుకోలేకపోవడం, లైంగిక కోరికలు తగ్గడం, నిద్ర సమస్యలు వంటివి ప్రమాద సంకేతాలుగా గుర్తించాలి.సప్లిమెంట్లపై ఆధారపడటం కంటే, జింక్, సెలీనియం, విటమిన్ డి, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ఫోలేట్ అధికంగా ఉండే సమతులాహారం తీసుకోవడం వీర్య కణాల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పాలు, గుడ్లు, పప్పులు, చేపలు, లీన్ మీట్ వంటి సహజ ఆహార పదార్థాల ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్‌ను పొందవచ్చు. దీర్ఘకాలిక ఆరోగ్యం, సంతాన సామర్థ్యాన్ని కాపాడుకోవాలంటే వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఎలాంటి పనితీరును పెంచే మందులు వాడకపోవడమే శ్రేయస్కరమని వారు నొక్కి చెబుతున్నారు.

బిస్లరీ వాటర్ తాగుతున్నారా.. అందులో ప్రమాదకర బ్రోమేట్..!



మనం ప్రయాణాలు చేస్తున్నప్పుడు ఎక్కువగా వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తుంటాం. బస్టాండ్లలో చాలా వరకు బ్రాండెడ్ కంటే లోకల్ బ్రాండ్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. మెయిన్ బ్రాండ్ల పేరులో ఒక అక్షరం తొలంగించి మరో అక్షరం చేర్చుతారు. మనం ఆతృతలో స్పెలింగ్ చూసుకోకుండా బాటిల్ కొనుగోలు చేసి తాగుతాం. అయితే తాజా ఒక మెయిన్ బ్రాండ్ కు సంబంధించి ఒక వార్త సంచలనం సృష్టిస్తోంది. బిస్లరీ వాటర్ సురక్షితం కాదని ఆదివారం ప్రకటించింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నమూనా అసురక్షితమని తేలడంతో బిస్లరీ ఇంటర్నేషనల్‌పై విచారణకు అనుమతి మంజూరు చేసినట్లు ఆహార నియంత్రణ సంస్థ నవంబర్ 22న ప్రకటన చేసింది. అసురక్షిత ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ కు సంబంధించి బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై విచారణకు అనుమతి మంజూరు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. విశ్లేషణ కోసం బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రాంగణం నుంచి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (మినరల్ వాటర్ కాకుండా) నియంత్రణ నమూనాను సేకరించారని పేర్కొంది. నిర్ణీత బ్రోమేట్ పరిమితులకు అనుగుణంగా లేదని తేలడంతో ఖీూా చట్టం, 2006 ప్రకారం దీనిని అసురక్షితంగా ప్రకటించామని నియంత్రణ సంస్థ తెలిపింది. కంపెనీ అప్పీల్ మేరకు ఈ నమూనాను రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపగా అందులో పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు కనుగొనబడటంతో అది కూడా అసురక్షితమని ప్రకటించిందని నియంత్రణ సంస్థ వెల్లడించింది. హైదరాబాద్‌లో నీటి కష్టాలకు చెక్.. నగరానికి తరలివస్తున్న 40 ఎంజీడీల గోదావరి జలాలు.. ల్యాబ్ పరిశోధనలు, చట్టం ప్రకారం అసురక్షిత ఆహారానికి సంబంధించిన ఉల్లంఘనలను నిర్ధారించాయని తెలిపింది. అందువల్ల, బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఎఫ్ఎస్ఎస్ చట్టం, 2006 కింద విచారణ ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రకటించింది. వసంత్ మసాలా ప్రైవేట్ లిమిటెడ్, టిట్-బిట్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మిమాన్సా ఇండస్ట్రీస్ మరియు ఆశా కన్ఫెక్షనరీతో సహా మరికొన్ని కంపెనీలపై కూడా విచారణకు అనుమతి ఇచ్చినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. నియమ నిబంధనలను పాటించనందుకు ఊర్మి లైఫ్‌సైన్సెస్ ఎల్ఎల్‌పి, గౌర్ ఆయుర్వేదిక్ స్టోర్ లైసెన్సులను ఈ నియంత్రణ సంస్థ నిలిపివేసింది. ఆశా కన్ఫెక్షనరీకి వ్యతిరేకంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ ఉత్పత్తిని వెనక్కి తీసుకోవాలని (ప్రొడక్ట్ రీకాల్) ఆదేశాలు కూడా జారీ చేసింది. ముందుగా ప్యాక్ చేసిన చాక్లెట్ నింపిన కుకీలు సురక్షితం కాదని తేలడంతో వాటిని ఉపసంహరించుకోవాలని ఆ కంపెనీని ఆదేశించింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఓర్వకల్లులో రిలయన్స్ అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్..

రాయలసీమలో వేలాది మందికి ఉద్యోగాలు..



ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో, ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధి చరిత్రలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్ పారిశ్రామిక వాడలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ నిర్మించిన ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్ శనివారం (నవంబర్ 21, 2026) నుండి తన ఉత్పత్తి కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించింది. గత ఏడాది (2025) నవంబర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగగా, రికార్డు స్థాయిలో కేవలం 12 నెలల వ్యవధిలోనే నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభం కావడం విశేషం. పది ఉత్పత్తి లైన్లతో అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటైన ఈ ప్రపంచ స్థాయి కేంద్రంలో ప్రముఖ స్వదేశీ శీతల పానీయం 'క్యాంపా కోలా' తో పాటు వివిధ రకాల పండ్ల రసాలు ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ మొదలైంది. ఈ చారిత్రాత్మక మైలురాయిపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ప్రత్యేక వీడియోను విడుదల చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో తమ ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ ప్లాంట్ ఒక సజీవ నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తరతరాలుగా భారతీయులు చూస్తూ పెరిగిన ఐకానిక్ స్వదేశీ బ్రాండ్ క్యాంపా కోలా నేడు రాయలసీమ గడ్డపై పునర్జన్మ పొందిందని.. ఓర్వకల్ నుండి భారతదేశంలోని ప్రతి ఇంటికీ, అలాగే అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ కానుందని లోకేష్ వివరించారు. స్వదేశీ బ్రాండ్లు అంతర్జాతీయ దిగ్గజాలతో పోటీ పడుతుండటం.. అందుకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలవడం ఎంతో గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. భారత సెమీ కండక్టర్ హబ్‌గా తిరుపతి.. 5 వేల ఎకరాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి కేంద్రం నయా ప్లాన్.. ఈ భారీ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు వెల్లువెత్తనున్నాయి. ఓర్వకల్ ప్లాంట్ ద్వారా స్థానికులకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించడంతో పాటు, రవాణా, లాజిస్టిక్స్, వ్యవసాయం, అనుబంధ రంగాలలో వేలాది మందికి పరోక్ష ఉపాధి మార్గాలు తెరుచుకోనున్నాయి. ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న స్థానిక యువతను చూస్తుంటే తనకు అత్యంత సంతోషం కలుగుతోందని లోకేష్ పేర్కొన్నారు. నంద్యాలకు చెందిన మహేష్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి స్థానిక యువతీయువకులు ఇకపై తమ కెరీర్‌ను నిర్మించుకోవడానికి సుదూర నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత జిల్లాలోనే ప్రపంచ స్థాయి పరిశ్రమలో పనిచేస్తున్నారని ఆయన ఉదాహరించారు. "యువత ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం కాదు, పరిశ్రమలే మన యువత వద్దకు రావాలన్నదే రాయలసీమకు మేమిచ్చిన హామీ.. నేడు అది నెరవేరిందని లోకేష్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకంతో భారీ పెట్టుబడి పెట్టిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ధన్యవాదాలు తెలిపిన ఆయన, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇటువంటి పారిశ్రామిక విజయాలను విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

నారాయణ హృదయాలయతో ఆస్టర్ డీఎం చర్చలు..!

ఆస్టర్ డిఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ తన ప్రత్యర్థి నారాయణ హృదయాలయ లిమిటెడ్ నుంచి ఉత్తర భారతదేశంలోని ఆసుపత్రులను కొనుగోలు చేయడానికి చర్చలు జరుపుతోంది. ఈ లావాదేవీ విలువ దాదాపు 150 మిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చర్చలు కొనసాగుతున్నాయని, నిబంధనలు మారవచ్చని లేదా ఒప్పందం కుదరకుండానే చర్చలు ముగియవచ్చని ఆ నివేదిక పేర్కొంది. ఈ లావాదేవీకి సంబంధించిన వార్తలను ఆ కంపెనీలు స్వతంత్రంగా ఇంకా ధృవీకరించలేదు. ఆస్టర్ డిఎం, బ్లాక్‌స్టోన్ వ్యాఖ్యానించడానికి నిరాకరించగా నారాయణ హృదయాలయ వైస్ చైర్ వీరేన్ శెట్టి, దీనిని మార్కెట్ ఊహాగానాలు లేదా పుకార్లుగా అభివర్ణించారు.భారతదేశం అంతటా తన ఆసుపత్రుల నెట్‌వర్క్‌ను విస్తరించాలనే ఆస్టర్ డిఎం వ్యూహంలో నారాయణ హృదయాల ఆస్పత్రులు కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. తన వృద్ధి ప్రణాళికలలో భాగంగా కంపెనీ గతంలో కూడా కొనుగోళ్లను గుర్తించింది. ఆస్టర్ డిఎంలో బ్లాక్‌స్టోన్‌కు దాదాపు 30 శాతం వాటా ఉందని, సెప్టెంబర్‌లో ఈ కంపెనీని తన టాప్ 10 గ్లోబల్ పెట్టుబడులలో ఒకటిగా అభివర్ణించిందని ఆ నివేదిక విచారించింది. ఆసుపత్రి రంగంలో కొనసాగుతున్న ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు, ఏకీకరణల మధ్య ఈ చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బంగారం ధరలు తగ్గాయి.. పసిడి రేటు ఈ రోజు ఎంతవరకు దిగి వచ్చిందంటే.. నవంబర్ 16, సోమవారం ధరలు ఇవే.. బ్లాక్‌స్టోన్, కేకేఆర్, టీపీజీ, అడ్వెంట్ ఇంటర్నేషనల్, జనరల్ అట్లాంటిక్, సింగపూర్‌కు చెందిన టెమాసెక్ హోల్డింగ్స్‌తో సహా పలు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు గత ఐదేళ్లలో భారతీయ ఆసుపత్రులలో 10 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని నివేదిక పేర్కొంది. సెప్టెంబర్‌లో ఢిల్లీకి చెందిన యథార్థ్ హాస్పిటల్ కంపెనీలో రూ. 31.5 బిలియన్లు, అంటే 337 మిలియన్ డాలర్లకు 25% వాటాను అడ్వెంట్ ఇంటర్నేషనల్ కొనుగోలు చేయడానికి ముందు ఆస్టర్ డీఎం కూడా ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి చర్చలు జరిపిందని ఆ నివేదిక వివరించింది. మే 2026లో నారాయణ హృదయాలయ ఆదాయాల సమీక్ష సమావేశంలో శెట్టి చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ అమ్మకంపై ఆసక్తి వ్యక్తమవుతోంది. ఆ సమావేశంలో ఆయన ఉత్తర భారతదేశం అత్యంత సవాలుతో కూడుకున్నదని పేర్కొన్నారు. తమ కంపెనీ మార్కెట్‌లోకి కొత్తగా ప్రవేశించిన సంస్థలలో ఒకటని, తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోందని ఆయన వివరించారు. క్యాన్సర్ చికిత్స వంటి ఉన్నత స్థాయి రంగాలలో నైపుణ్యం సరిపోదని, ఎందుకంటే పోటీ ఆసుపత్రులు మరింత దూకుడుగా విస్తరణ వ్యూహాలను అనుసరి స్తున్నాయని కూడా శెట్టి పేర్కొన్నారు డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారు కొద్ది రోజులు ఆగితే బెటర్..!



ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారు కొంత ఆగాలా లేక ఇప్పుడే చేయాలా అనే సందేహాలు వస్తున్నాయి. ఎందుకంటే దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు ఆర్బీఐ వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అక్టోబర్ లో రెపో రేట్ ను పెంచింది. దీంతో పలు బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాయి. ఇప్పుడు డిసెంబర్ లో జరగబోయే ఆర్బీఐ ఎంపీసీ మీటింగ్ లో రెపో రేటు పెంచే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలు మరోసారి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంది.దీంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవారు ఆలోచిస్తున్నారు. అయితే ప్రస్తుతం పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, ప్రభుత్వ బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలు ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లను ఓసారి చూద్దాం. సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐదేళ్ల డిపాజిట్‌పై 8.25 శాతం అత్యధిక రేటును అందిస్తోంది. అనేక ఇతర బ్యాంకులు 7 శాతం లేదా అంతకంటే ఎక్కువ రేట్లను అందిస్తున్నాయి. అయితే అత్యధిక రాబడులు తరచుగా నిర్దిష్ట డిపాజిట్ కాలపరిమితులతో ముడిపడి ఉంటాయని గుర్తుంచుకోవాలి. సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.10 శాతం వడ్డీ అందిస్తోంది.గుడ్ న్యూస్.. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్.. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8 శాతం వడ్డీరేట్లు అందిస్తున్నాయి. డీసీబీ బ్యాంక్ 7.75 శాతం ఆఫర్ చేస్తుండగా.. ఎస్‌బిఎం బ్యాంక్ ఇండియా 7.65 శాతం వరకు వడ్డీ టెల్లిస్తోంది. బంధన్ బ్యాంక్ 7.45 శాతం వరకు అందిస్తుండగా.. సిటీ యూనియన్ బ్యాంక్ 7.30 శాతం వరకు అందిస్తుంది. ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, యెస్ బ్యాంక్ 7.25 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తున్నాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 7 శాతం వరకు అందిస్తుండగా.. పంజాబ్ & సింధ్ బ్యాంక్ 6.90 శాతం వరకు అందిస్తుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.85 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇండియన్ బ్యాంక్ 6.80 శాతం వడ్డీ చెల్లిస్తుండగా.. కెనరా బ్యాంక్ 6.75 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. పెట్టుబడిదారులు కేవలం ప్రకటించిన వడ్డీ రేటు ఆధారంగా మాత్రమే ఎఫ్‌డిని ఎంచుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. కాలపరిమితి, గడువుకు ముందే ఉపసంహరించుకుంటే విధించే జరిమానా, వడ్డీ ఆదాయంపై పన్ను వంటివి వాస్తవ రాబడులను ప్రభావితం చేయగలవని గుర్తుంచుకోవాలి. డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే బ్యాంకులలోని డిపాజిట్లకు, వర్తించే నిబంధనలకు లోబడి, అసలు, వడ్డీతో సహా, ప్రతి డిపాజిటర్‌కు, ప్రతి బ్యాంకుకు రూ. 5 లక్షల వరకు బీమా ఉంటుంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడుతున్నారా..!



గత రెండేళ్లలో స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్ల అంతగా రాణించడం లేదు. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ సెప్టెంబర్ 2024లో గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత ఐదు నెలల్లోనే అది 27 శాతం పడిపోయింది. జూలై 2025 నాటికి దాదాపు తిరిగి కోలుకుంది. ఆ తర్వాత మళ్లీ పతనమైంది. మార్చి 2026 నాటికి జూలైలో నమోదైన గరిష్ట స్థాయి కంటే 20 శాతం తక్కువకు పడిపోయింది. మళ్లీ పుంజుకుని సెప్టెంబర్‌లో కొత్త గరిష్ట స్థాయిని తాకినప్పటికీ ఆ తర్వాత 9 శాతం క్షీణించింది. ఇలా రెండుసార్లు భారీగా పడి, రెండుసార్లు కోలుకున్న తర్వాత ఈ సూచీ ప్రస్తుతం ఏడాది క్రితం ఉన్న స్థాయిలోనే కోలుకుంది. ఫిబ్రవరి 2024లో స్మాల్-క్యాప్ ఫండ్‌ల నిర్వహణలో రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఉండగా.. అక్టోబర్ 2026 నాటికి ఆ మొత్తం రూ. 4.4 లక్షల కోట్లకు పెరిగింది. ఈ వృద్ధిలో నాలుగో వంతు కంటే కొంచెం ఎక్కువ మాత్రమే ధరల పెరుగుదల వల్ల వచ్చింది. మిగిలిన రూ. 1.4 లక్షల కోట్లు కొత్తగా వచ్చిన పెట్టుబడులే. మార్కెట్ రెండుసార్లు పడిపోయినప్పటికీ పెట్టుబడిదారులు తాము పెట్టిన పెట్టుబడుల కంటే ఎక్కువ మొత్తాన్ని వెనక్కి తీసుకున్న నెల ఒక్కటి కూడా లేదు. మార్కెట్ పడిపోయిన వెంటనే అత్యధికంగా కొత్త పెట్టుబడులు వచ్చాయి. కచ్చితమైన ప్లానింగ్ పెట్టుబడిదారులు పెట్టుబడి పెడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. అత్యధిక రాబడి ఇచ్చిన లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..! గత 10 ఏళ్ల పనితీరును గమనిస్తే.. సాధారణ స్మాల్-క్యాప్ ఫండ్ ఏడాదికి సగటున 15.2 శాతం రాబడిని ఇచ్చింది. ఇదే కాలంలో మిడ్-క్యాప్ ఫండ్లు 14.3 శాతం, ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్లు 11.9 శాతం, లార్జ్-క్యాప్ ఫండ్లు 10.7 శాతం రాబడిని అందించాయి. స్మాల్ క్యాప్ 2020లో భారీగా పతనమైంది. ఆ తర్వాత మరో రెండుసార్లు పడిపోయింది. ఆ తర్వాత స్వల్పంగా రికవరీ అయింది. డిసెంబర్ 2017లో మార్కెట్ విలువ ప్రకారం 251 నుంచి 1,000వ ర్యాంకులో ఉన్న 750 స్మాల్ క్యాప్ కంపెనీలలో కేవలం 34 మాత్రమే అప్పటి నుంచి మిడ్ లేదా లార్జ్ క్యాప్‌లుగా ఎదిగాయి. వాటిలో సగానికి పైగా ఇప్పుడు మైక్రో క్యాప్‌లుగా ఉన్నాయి. స్మాల్-క్యాప్ పెట్టుబడి అనేది పెరుగుదలను అందుకోవడం కన్నా, పతనాన్ని తట్టుకుని నిలబడే విధంగా ఉండాలి. అందుకే తక్కువ అస్థిరత ఉన్న స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

తెలంగాణలో రికార్డ్ స్థాయిలో పెరిగిన వస్తువుల ఎగుమతులు..!



తెలంగాణలో వస్తువుల ఎగుమతులు 68.3 శాతం వృద్ధిని నమోదు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని చివరి మూడు ఏళ్లతో పోలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి మూడు ఏళ్లలో తెలంగాణలో వస్తువుల ఎగుమతులు పెరిగాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ అందించిన వివరాల ప్రకారం వస్తువుల ఎగుమతుల సగటు వార్షిక విలువ 2020-23 కాలంలో రూ. 79,000 కోట్లు ఉండగా, 2023-26 కాలానికి అది రూ. 1.33 లక్షల కోట్లకు పెరిగింది. రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు దోహదపడ్డాయని పరిశ్రమల శాఖ పేర్కొంది. ఈ ఆరేళ్ల కాలంలో తెలంగాణ నుంచి వస్తువుల ఎగుమతులు 2020-21లో రూ. 64,539 కోట్ల నుంచి 2025-26 నాటికి రూ. 1,22,655 కోట్లకు పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ. 1,61,843 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతుల్లో కూడా తెలంగాణ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ సమాచారం ప్రకారం 2025 అక్టోబర్‌తో పోలిస్తే 2026 అక్టోబర్‌లో ఈ రంగం 69 శాతం వృద్ధిని నమోదు చేసింది. బంగారం ఇప్పుడే కొనుగోలు చేయాలా.. లేకా ఆగాలా..! 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలోని ఇదే కాలంతో పోలిస్తే ఇంజనీరింగ్ ఎగుమతులు దాదాపు 31 శాతం పెరిగాయి. వివిధ ఉత్పత్తి విభాగాల్లో, అంతర్గత దహన యంత్రాల విడిభాగాల ఎగుమతులు అత్యధికంగా 244 శాతం వృద్ధిని సాధించాయి. సీసం, సీసపు ఉత్పత్తుల ఎగుమతులు 196 శాతం పెరగగా, రాగి, రాగి ఉత్పత్తుల ఎగుమతులు 106 శాతం వృద్ధిని నమోదు చేశాయి. విద్యుత్ యంత్రాలు, యాంత్రిక పరికరాల ఎగుమతులు కలిపి 2024-25లో రూ. 14,632.20 కోట్లు ఉండగా, 2025-26లో రూ. 17,764.81 కోట్లకు పెరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 29,131 కోట్ల విలువైన ఎగుమతులతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వస్తువుల ఎగుమతుల్లో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రం మొత్తం ఎగుమతుల్లో ఈ జిల్లా వాటా 23.75 శాతంగా ఉంది. రూ. 26,437 కోట్ల ఎగుమతులతో హైదరాబాద్ రెండో స్థానాన్ని దక్కించుకోగా రూ. 24,970 కోట్ల ఎగుమతులు సాధించిన సంగారెడ్డి మూడో స్థానంలో నిలిచింది. ఇతర జిల్లాల్లో కూడా తయారీ రంగ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎగుమతులు 2024-25లో రూ. 6,818.20 కోట్లు ఉండగా.. 2025-26 నాటికి అవి రూ. 10,648.13 కోట్లకు పెరిగి, 56.17 శాతం వృద్ధిని నమోదు చేశాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎగుమతులు రూ. 3,117.97 కోట్ల నుంచి రూ. 4,119.68 కోట్లకు పెరిగి, 32.13 శాతం వృద్ధిని సాధించాయి. ఈ జిల్లాల్లో నమోదైన వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధి కేంద్రాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించే ప్రభుత్వ క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాకు అనుగుణంగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్.. కర్నూలు జిల్లాలో ఆసియాలోనే అతి పెద్ద బేవరేజ్ ప్లాంట్..



ఏపీకి కొ



రష్మిక మందన్న 'మైసా' రిలీజ్ వాయిదా.. నవంబర్ 27న రావడం లేదని మేకర్స్ ప్రకటన!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని తొలుత నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. అయితే, తాజాగా ఈ విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'మైసా' ప్రపంచాన్ని ఎటువంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో, సినిమాకు తగిన గొప్ప అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ దార్శనికతతో నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. కొత్త రిలీజ్ డేట్ వచ్చేలోపు అభిమానులు ఆ ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ, చిత్రంలోని జోష్ నింపే 'ఓసే రాములమ్మ' పాటను ఆస్వాదించాలని మేకర్స్ కోరారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్, టీ-సిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వాయిదా వార్తతో అభిమానులు కొంత నిరాశకు గురైనప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా సినిమాను తీసుకువస్తున్నారన్న అంశం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.



శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్.. పసుపు చీరలో మెరిసిపోయిన బాలీవుడ్ బ్యూటీ

సైకిల్ పక్కన దిశా పటానీ అందాల పోజులు.. లేటెస్ట్ ఫొటోలు వైరల్



వెండితెరపై నాగదుర్గ వెలుగు



జానపద పాటలు, కూచిపూడి నాట్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు పొందిన నల్లగొండకు చెందిన నాగదుర్గ వెండితెరపై పరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఇదుపు కాయితం' సినిమా షూటింగ్ ఇటీవల పూర్తయి విడుదలకు సిద్ధం కాగా.. తాజాగా 'శనార్తి' చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. జానపద గీతాల ద్వారా తన అభినయం, హావభావాలతో ప్రేక్షకులను అలరించిన నాగదుర్గ ఇప్పుడు పూర్తిస్థాయి సినీ నటిగా మారుతున్నారు. ఇప్పటికే ఆమె నటించిన ఇదుపు కాయితం చిత్రీకరణ పనులు పూర్తయి, విడుదల దశకు చేరుకున్నాయి. మరోవైపు కొత్త ప్రాజెక్ట్ శనార్తి సినిమాకు నాగదుర్గ పచ్చజెండా ఊపారు. కథాంశం, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఈ చిత్రంపై ఆమె ఎంతో ఆశలు పెట్టుకున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న శనార్తి సినిమాతో ఆమె కెరీర్‌లో మరో కీలక ఘట్టం మొదలవనుంది.

కళాసేవలోనూ ముందుంటూ...

ఒకవైపు జానపద పాటలు, యూట్యూబ్ ఇన్‌ఫ్లుఝెన్సర్‌గా, మరోవైపు సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా.. నాగదుర్గ తన మూలాలను, కళాసేవను మర్చిపోలేదు. పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడిలో పీజీ పూర్తి చేసిన ఆమె, భవిష్యత్‌లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. నల్లగొండలో నాగదుర్గ నాట్యాలయం పేరుతో కూచిపూడి శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ వారాంతాల్లో స్వస్థలానికి వచ్చి కళాభివృద్ధికి పాటుపడుతున్నారు.

కూచిపూడి నుంచి మొదలైన పయనం

ఉమ్మడి నల్లగొండ జిల్లా అడ్డగూడూరు నాగదుర్గ స్వస్థలం. ఉద్యోగరీత్యా తల్లిదండ్రులు నల్లగొండలో స్థిరపడ్డారు. నాగదుర్గ పదో తరగతి వరకు నల్లగొండలో చదువుకుని, హైదరాబాద్‌లో ఇంటర్, బీఎస్సీ పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే నృత్యంపై ఉన్న మక్కువతో కూచిపూడిలో శిక్షణ తీసుకున్నారు. 2021లో 'తిన్నాతీరం పడతలే' జానపద పాటతో నటనలోకి అడుగుపెట్టిన ఆమె. నాలుగేళ్ల వ్యవధిలో సుమారు 300 జానపద పాటల్లో నటించి యూట్యూబ్‌లో కోట్లాది వ్యూస్, 100 మిలియన్ మార్క్‌ను అందుకున్నారు. శాస్త్రీయ నృత్యం నుంచి జానపదంలోకి వచ్చి, ఇప్పుడు వరుస సినిమాలతో వెండితెరపై తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.